B9 NEWS
నిజం - మా ఇజం

మన.. ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం...



PUBLISHED FROM: Telangana & Andhrapradesh | సంపుటి : 01 | సంచిక : 267 | ఆదివారం | 25-10-2026 | ఎడిటర్ : పులిజ్వాల చంద్రకాంత్ | పేజీలు : 08 | వెల : 05/-



2

నోయిడాలో భారీ అగ్నిప్రమాదం.. ఒకరు మృతి

నోయిడాలో భారీ అగ్నిప్రమాదం.. ఒకరి మృతి

ఐదు టీ, స్నాక్స్ దుకాణాలు పూర్తిగా దగ్ధం

ఘటనా స్థలంలో పెద్ద సంఖ్యలో ఎల్పీజీ సిలిండర్లు

మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది

మన ప్రజాపక్షం,ఉత్తరప్రదేశ్

ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో శనివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా, పలు దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. నోయిడా సెక్టార్ 125లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన టీ, స్నాక్స్ దుకాణాల్లో తొలుత మంటలు చెలరేగాయి.సెక్టార్ 126 పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయ్‌పూర్ ప్రాంతంలో ఉన్న ఐదు దుకాణాలకు మంటలు వేగంగా వ్యాపించాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది హుటాహుటిన ఘటనా

మోదీ ఫొటోకు క్షుద్రపూజలు!

వీడియో వైరల్-కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రధాని మోదీ ఫొటోకు క్షుద్రపూజలు చేసిన వీడియో ఆన్‌లైన్‌లో హల్‌చల్ చేస్తోంది. దీనితో ఉత్తరప్రదేశ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

2

రక్షణ రంగంలో దేశాన్ని అగ్రగామి శక్తిగా తీర్చిదిద్దేందుకు

కలిసి పనిచేద్దాం



2

మన ప్రజాపక్షం,హైదరాబాద్

సీఎం రేవంత్‌రెడ్డి ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన రక్ష ఎక్స్‌పో-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రక్షణ సాంకేతిక ఎగుమతులు చేసే దేశంగా భారత్ ఎదగాలని ఆకాంక్షించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానిస్తున్నామన్న సీఎం రేవంత్ రెడ్డి అంతర్జాతీయ వేదికగా రక్షా ఎక్స్‌పోను తీర్చిదిద్దాలన్నది తన ఆలోచన తెలిపారు. హైదరాబాద్ ఒక వ్యూహాత్మకమైన ప్రదేశంగా కీలకమైన స్థానంలో ఉందని, హైదరాబాద్ అత్యంత సురక్షితమైన నగరమని, సముద్రం లేకపోయినా నౌకాదళానికి రాష్ట్రం కీలకమైన సేవలు అందిస్తోందని స్పష్టం చేశారు. ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన రక్ష ఎక్స్‌పో-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా తీర్చిదిద్దామని, రక్షణ రంగంలో అగ్రగామిగా భారతదేశాన్ని చూడాలన్నది తమ ఆకాంక్ష అని, రక్షణ సాంకేతిక ఎగుమతులు చేసే దేశంగా భారత్ ఎదగాలని తెలిపారు. రక్షణ పరిశ్రమకు తెలంగాణ అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా ఎదగాలని పేర్కొన్నారు.తెలంగాణ గ్లోబల్ సమిట్-2026లో భాగంగా డిసెంబరు 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో భారీ స్థాయిలో రక్షా ఎక్స్‌పోను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ సందర్భంగా



2

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు

సమావేశం వాయిదా..

మహారాష్ట్రకు సీఎం రేవంత్ రెడ్డి

సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా

తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు బోర్డు నిర్ణయం

సీఎం రేవంత్ రెడ్డి ముంబై పర్యటన కారణంగా అధికారులు హాజరుకాలేరని వెల్లడి

మంగళవారానికి సమావేశాన్ని తిరిగి షెడ్యూల్ చేసిన కేఆర్ఎంబీ

మన ప్రజాపక్షం,హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపిణీపై చర్చించేందుకు సోమవారం (అక్టోబర్ 26) జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) 21వ సమావేశం వాయిదా పడింది. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఈ భేటీని మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు బోర్డు ప్రకటించింది.తెలంగాణ ముఖ్యమంత్రి

మాదాపూర్ సున్నం చెరువు పరిధిలో

అక్రమ బోర్లు

తొలగించిన హైడ్రా

2

పీసుమామిడి పేలుడు ఘటనపై జగన్ దిగ్భ్రాంతి..

2

సమగ్ర విచారణకు డిమాండ్

అల్లూరి జిల్లాలో రోడ్డు పనుల వద్ద భారీ పేలుడు

జిలెటిన్ స్టిక్స్ పేలి ఏడుగురి మృతి

అత్యంత బాధాకరమన్న జగన్

మన ప్రజాపక్షం,అల్లూరి సీతారామరాజు

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ ఉదయం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అనంతగిరి మండలం పీసుమామిడి ఘాట్ రోడ్డులో నిర్మాణ పనుల్లో భాగంగా జిలెటిన్ స్టిక్స్ పేలడంతో ఏడుగురు





2

కేంద్ర నిధులపై తెలంగాణ

సర్కార్ ఫోకస్

అధికారులకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు

కేంద్ర ప్రాయోజిత పథకాలపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష

నిధుల రికవరీ, వినియోగం వేగవంతం చేయాలని ఆదేశం

కేంద్ర అధికారులతో సమన్వయం పెంచుకోవాలని సూచన

అవసరమైతే కేంద్ర కార్యదర్శులతో తానే చర్చిస్తానని వెల్లడి

హైదరాబాద్‌కు నీటి గండం..

పొదుపుగా వాడాలంటూ లౌడ్‌స్పీకర్లతో ప్రచారం

ఎల్‌నినో ప్రభావంతో హైదరాబాద్‌లో తీవ్ర నీటి కొరత

నీటి వృథాను అరికట్టాలని లౌడ్‌స్పీకర్లతో ప్రచారం

రాష్ట్రంలో 27 శాతం తక్కువ వర్షపాతం నమోదు

తాగునీటి సరఫరాకే తొలి ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం

నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమాలకు అధికారుల ఆదేశం

2



మన ప్రజాపక్షం,హైదరాబాద్

హైదరాబాద్ నగరాన్ని తీవ్ర నీటి సంక్షోభం ఆందోళనకు గురిచేస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం తగ్గడం, రిజర్వాయర్లలో నీటిమట్టాలు గణనీయంగా పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. తాగునీటి

ఢిల్లీలో నేడు అత్యుత్తమ గాలి నాణ్యత నమోదు..

దశాబ్ద కాలంలో ఇదే బెస్ట్!

శనివారం (అక్టోబర్ 24న) 191గా నమోదైన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్

ప్రభుత్వ నిరంతర చర్యల వల్లే ఇది సాధ్యమైందన్న ఢిల్లీ పర్యావరణ మంత్రి

గత 24 గంటల్లో వేలాది వాహనాలకు చలాన్లు, వ్యర్థాల తొలగింపు

కాలుష్య నియంత్రణను యుద్ధప్రాతిపదికన కొనసాగిస్తామని స్పష్టీకరణ

2



మన ప్రజాపక్షం,ఢిల్లీ

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యంపై ప్రభుత్వాలు సాగిస్తున్న పోరాటం సత్ఫలితాలనిస్తోంది. శనివారం నాడు (అక్టోబరు 24) నగరంలో గాలి నాణ్యత సూచీ 191 వద్ద 'మోడరేట్' కేటగిరీలో నమోదైందని, ఇది గత దశాబ్ద కాలంలో నమోదైన అత్యుత్తమ గాలి నాణ్యత అని ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా ప్రకటించారు. కోవిడ్-19 ప్రభావిత కాలాన్ని మినహాయిస్తే, పదేళ్లలో ఇదే అత్యంత మెరుగైన ఏక్యూఐ అని ఆయన అన్నారు. వాయు కాలుష్యంపై ఢిల్లీ

ఎవరి శాంతి కోసం నేను సంతకం చేయాలి?

నేహా బోరా ఫైర్

పోలీసులు జారీ చేసిన పీస్ బాండ్‌పై సంతకం చేయడానికి నేహా బోరా నిరాకరణ

నిరసన తెలిపే హక్కును అణచివేసే ప్రయత్నమిది అని ఆరోపణ

ఓటర్ల జాబితా తొలగింపుపై నిరసన తెలపడమే నేరమా అని ప్రశ్న

శాంతి కేవలం ప్రభుత్వానికే కాదు, ప్రజలకు కూడా ఉండాలని వ్యాఖ్య

2



మన ప్రజాపక్షం,ఢిల్లీ

ఢిల్లీ పోలీసులు జారీ చేసిన 'పీస్ బాండ్' (శాంతి పత్రం)పై సంతకం చేసేందుకు అఖిల భారత విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా

All are Continues Second Page

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు
సమావేశం వాయిదా..

మొదటి పేజీ తరువాయి

రేవంత్ రెడ్డి సోమవారం ముంబై పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కాలేరని తెలంగాణ ఇంజనీర్-ఇన్-చీఫ్ కేఆర్ఎంబీకి లేఖ ద్వారా తెలియజేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు సంబంధించిన కీలక చర్చల నిమిత్తం ముఖ్యమంత్రి మహారాష్ట్రకు వెళుతున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ కారణం చేత సమావేశాన్ని వాయిదా వేయాలని కోరారు.తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కేఆర్ఎంబీ, సమావేశాన్ని మంగళవారానికి రీషెడ్యూల్ చేసింది. ఈ మార్పునకు సంబంధించిన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు అధికారికంగా తెలియజేసింది. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలు, నీటి పంపిణీకి సంబంధించిన కీలక అంశాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు.

నోయిడాలో భారీ అగ్నిప్రమాదం.

మొదటి పేజీ తరువాయి

స్థలానికి చేరుకున్నారు. ఆరు అగ్నిమాపక యంత్రాల సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. ప్రమాద సమయంలో దట్టమైన నల్లటి పొగ ఆ ప్రాంతాన్ని అలుముకోవడంతో, అధికారులు ముందు జాగ్రత్తగా సమీపంలోని రహదారులను మూసివేసి సహాయక చర్యలు చేపట్టారు.సహాయక చర్యల సమయంలో ఒక వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని సిబ్బంది గుర్తించారు. వెంటనే బాధితుడిని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని అధికారులు వెల్లడించారు.ఘటనా స్థలంలో పెద్ద సంఖ్యలో ఎల్పీజీ సిలిండర్లు ఉన్నాయని, వాటి కారణంగా మరింత ప్రమాదాలు సంభవించకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు నోయిడా చీఫ్ ఫైర్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. శిథిలాల కింద ఎవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు వివరించారు.

ఎవరి శాంతి కోసం నేను
సంతకం చేయాలి?

మొదటి పేజీ తరువాయి

నిరాకరించారు. నిరసన తెలిపే ప్రాథమిక హక్కును అణచివేసేందుకే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆమె ఆరోపించారు. "ఈ బాండ్ పై సంతకం చేసి నేను ఎవరి శాంతిని కాపాడాలి?" అని ఆమె సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ఢిల్లీలోని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్లమెంటరీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు, ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను ప్రశ్నించడం వంటి అంశాలపై అక్టోబర్ 16న మండీ హౌస్ వద్ద జరిగిన నిరసనలో పాల్గొన్నప్పుడు తనను అదుపులోకి తీసుకున్నారని నేహా బోరా తెలిపారు. అనంతరం, భారతీయ నాగరిక సురక్షా సంహిత సెక్షన్ 126 కింద ఢిల్లీ పోలీసులు అక్టోబర్ 17న తనకు నోటీసులు జారీ చేశారని చెప్పారు. విచారణ సమయంలో శాంతికి భంగం కలిగించకుండా ఉండేందుకు రూ.10,000 వ్యక్తిగత బాండ్‌తో పాటు ఒకరి పూచీకత్తు సమర్పించాలని ఆ నోటీసులో పేర్కొన్నారని వివరించారు."ప్రజాస్వామ్య నిరసనలను అరికట్టేందుకు శాంతి బాండ్లను ఒక ఆయుధంగా వాడుతున్నారు. ఈ బాండ్‌పై సంతకం చేస్తే, నిరసన తెలిపే రాజ్యాంగబద్ధ హక్కును స్వయంగా వదులుకున్నట్లే అవుతుంది. అందుకే నేను సంతకం చేయబోను" అని నేహా బోరా స్పష్టం చేశారు. ఆందోళన సమయంలో తాము శాంతికి భంగం కలిగించలేదని, పోలీసులే లాఠీఛార్జ్ చేయడం, మహిళల దుస్తులు చించడం, జర్నలిస్టులపై దాడికి పాల్పడటం వంటి హింసకు దిగారని ఆమె ఆరోపించారు. "శాంతి అనేది కేవలం ప్రభుత్వానికి మాత్రమే కాదు, ప్రజలకు కూడా ఉండాలి" అని ఆమె వ్యాఖ్యానించారు.పోలీసు నోటీసును సవాల్ చేస్తూ తాను దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసినప్పటికీ, కేసు యోగ్యతలను పరిశీలించలేదని నేహా తెలిపారు. విచారణలో పాల్గొనాలని మాత్రమే కోర్టు సూచించిందని, షోకాజ్ నోటీసు ఇచ్చి బాండ్‌పై సంతకం చేయాలని ఎవరినీ బలవంతం చేయలేరని ఆమె వాదించారు. ఇలాంటి బాండ్లను తమ సంఘం వ్యతిరేకిస్తూనే ఉంటుందని, వాటిని సాధారణ విషయంగా మార్చేందుకు అంగీకరించబోమని ఆమె తేల్చిచెప్పారు



మోదీ ఫొటోకు
క్షుద్రపూజలు!

మొదటి పేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోను ఉపయోగించి, శ్మశానవాటిక సమీపంలో క్షుద్రపూజలు చేస్తున్నట్లు ఉన్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనితో పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు."సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వీడియోలో, దోరిఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సరయూ నదీ తీరాన ప్రధాని మోదీ ఫొటో చట్టూ కొబ్బరికాయలు, నిమ్మకాయలు పెట్టారు. నారింజ రంగు పొడితో ముగ్గులు వేసి ఉన్నాయి. ఈ వీడియో ఎక్కడి నుంచి వచ్చిందో ఆరా తీస్తున్నాం. ఘటన జరిగిన ప్రదేశం నుంచి కూడా ఆధారాలు సేకరిస్తున్నాం. అలాగే చుట్టుపక్కల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నాం. గుర్తు తెలియని నిందితులపై భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్)లోని వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశాం" అని ఘోసీ సర్కిల్ ఆఫీసర్ సత్యేంద్ర భూషణ్ తివారీ చెప్పారు. నదీతీరాన ప్రధాని ఫొటోను, పూజా సామగ్రిని ఎవరు ఉంచారు సోషల్ మీడియాలో ఈ వీడియో ప్రచారం చేయడం వెనుకున్న వారి ఉద్దేశం ఏమిటి? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

హైదరాబాద్‌కు నీటి గండం..

మొదటి పేజీ తరువాయి

సరఫరాపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుండటంతో, నీటిని పొదుపుగా వాడుకోవాలని నగరంలోని రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు పౌరులకు విజ్ఞప్తి చేస్తున్నాయి.మణికొండలోని పంచవటి సాయి లక్ష్మి కాలనీలో ఒక వ్యక్తి సైకిల్‌పై లౌడ్‌స్పీకర్‌తో అవగాహన కల్పిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కార్లు, సెల్లార్లు, రోడ్లు, టెర్రస్‌లు శుభ్రం చేసేందుకు కుళాయి లేదా బోర్ నీటిని వృథా చేయవద్దని ఆయన నినదిస్తున్న తీరు, నగరంలో నెలకొన్న నీటి ఎద్దడి తీవ్రతను కళ్లకు కడుతోంది.రాష్ట్రంలో నెలకొన్న ఈ క్లిష్ట పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా అంగీకరించింది. ఈ ఏడాది సాధారణం కంటే 27 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, ఫలితంగా రాష్ట్రంలోని 621 మండలాలకు గాను 324 మండలాల్లో భూగర్భ జలాలు అట్టడుగుకు పడిపోయాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి. కొన్ని రిజర్వాయర్లలో నీటి నిల్వలు 20 శాతం కంటే తక్కువకు చేరుకున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా తెలిపారు. ప్రస్తుత తరుణంలో సాగునీటి కంటే ప్రజలు, పశువులు, ఇతర జీవరాశుల తాగునీటి అవసరాలకే ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.ప్రస్తుతం రాష్ట్రంలోని జలాశయాల్లో 30 నుంచి 40 శాతం మేర నీటి నిల్వలు ఉన్నాయని, 2027 జూలై వరకు తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడటమే తమ ప్రథమ కర్తవ్యమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులు, నీటి పొదుపు ఆవశ్యకతపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. నీటి సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక టోల్-ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

పీసుమామిడి పేలుడు ఘటనపై
జగన్ దిగ్భ్రాంతి..

మొదటి పేజీ తరువాయి

మృతి చెందారు. మృతుల్లో, విధి నిర్వహణకు వెళుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కూడా ఉండటం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో ఒక బొలెరో, ఒక టిప్పర్ వాహనాలు పూర్తిగా కాలిపోయాయి.పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... రోడ్డు విస్తరణ పనుల కోసం రాళ్లను పగలగొట్టేందుకు బొలెరో వాహనంలో జిలెటిన్ స్టిక్స్ ఉంచారు. సమీపంలో ఉన్న టిప్పర్‌కు డీజిల్ నింపుతుండగా ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. ఈ మంటలు వేగంగా వ్యాపించి జిలెటిన్ స్టిక్స్ ఉన్న వాహనానికి అంటుకోవడంతో భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో విశాఖపట్నం నుంచి మద్దిరేబు ఎంపీపీ పాఠశాలకు వెళుతున్న ఉపాధ్యాయురాలు సునీతతో పాటు కార్మికులు మణి, నారాయణరావు, పవన్ కుమార్ మరికొందరు ప్రాణాలు కోల్పోయారు.ఈ దుర్ఘటనపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. ఈ దుర్ఘటనలో కార్మికులతో పాటు ప్రభుత్వ టీచర్ సునీత కూడా మృతి చెందడం అత్యంత బాధాకరం. ఉపాధి కోసం వచ్చిన కార్మికులు, విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయురాలు ఇలా ఆకస్మికంగా ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపించాలి. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తగిన ఆర్థిక పరిహారం అందించాలి" అని డిమాండ్ చేశారు.ప్రమాదంపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కూడా స్పందించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు అండగా నిలవాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రక్షణ రంగంలో దేశాన్ని అగ్రగామి శక్తిగా తీర్చిదిద్దేందుకు కలిసి పనిచేద్దాం

మొదటి పేజీ తరువాయి

ఫలక్‌నుమా ప్యాలెస్‌లో రక్ష ఎక్స్‌పో-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించారు.

ఢిల్లీలో నేడు అత్యుత్తమ గాలి నాణ్యత నమోదు..

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం చేస్తున్న నిరంతర పోరాటంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి అని ఆయన అభివర్ణించారు.గత గణాంకాలను పరిశీలిస్తే, అక్టోబర్ 24న 2024లో ఏక్యూఐ 306గా, 2025లో 275గా నమోదైందని, ఈ ఏడాది 191కి తగ్గడం గణనీయమైన పురోగతిని సూచిస్తోందని మంత్రి వివరించారు. కాలుష్య నివారణకు చేపట్టిన స్థిరమైన చర్యలు, కఠినమైన అమలు, వివిధ ప్రభుత్వ ఏజెన్సీల సమన్వయంతో కూడిన జోక్యం వల్లే ఈ సానుకూల మార్పు సాధ్యమైందని ఆయన తెలిపారు.ముఖ్యమంత్రి రేఖా గుప్తా నాయకత్వంలో ఢిల్లీ ప్రభుత్వం కాలుష్య నియంత్రణకు సమగ్రమైన, కార్యాచరణ-ఆధారిత విధానాన్ని అవలంబిస్తోందని సిర్సా పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో నిబంధనల అమలు, రెగ్యులర్ తనిఖీలు, జిల్లా స్థాయి సమీక్షలు, టెక్నాలజీ ఆధారిత పర్యవేక్షణ వంటి బహుముఖ వ్యూహాలతో కాలుష్య కారకాలను మూలాల వద్దే అరికట్టడంపై దృష్టి సారించినట్లు చెప్పారు.గాలి నాణ్యతలో ఈ మెరుగుదల ప్రభుత్వ నిరంతర కృషి, అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, ఢిల్లీ నివాసితుల సమష్టి సహకారం వల్లే సాధ్యమైందని మంత్రి అన్నారు. స్వచ్ఛమైన గాలి కోసం సాగుతున్న ఈ ప్రచారానికి మద్దతిస్తున్న ఢిల్లీ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా గాలి నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు తమ ప్రయత్నాలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. కాలుష్య నియంత్రణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని సంబంధిత శాఖలను ఆదేశించినట్లు స్పష్టం చేశారు. జవాబుదారీతనం, సమర్థవంతమైన అమలు, ప్రజా భాగస్వామ్యంతో ఈ ప్రచారాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనసాగిస్తామని సిర్సా పునరుద్ఘాటించారు.కాలుష్య నివారణ చర్యలను ముమ్మరం చేయడంలో భాగంగా, గత 24 గంటల్లో ప్రభుత్వం చేపట్టిన కీలక చర్యల వివరాలను కూడా వెల్లడించారు. వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు 9,883 వాహనాలకు చలాన్లు విధించారు. గుర్తించిన ప్రాంతాల నుంచి 12,702 మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించారు. రోడ్లపై దుమ్ము ధూళిని నియంత్రించేందుకు 1,075 కిలోమీటర్ల మేర నీటిని చల్లారు. 2,223 మెట్రిక్ టన్నుల నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను తరలించడంతో పాటు, 2,810 కిలోమీటర్ల రోడ్లను మెకానికల్ స్వీపింగ్ ద్వారా శుభ్రం చేశారు.

కేంద్ర నిధులపై తెలంగాణ
సర్కార్ ఫోకస్

మొదటి పేజీ తరువాయి

కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రానికి అందాల్సిన నిధులను సత్వరమే రాబట్టి, వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. నిధుల విడుదలలో జాప్యాన్ని నివారించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును, నిధుల వినియోగాన్ని సీఎస్ సమీక్షించారు. లభ్యతలో ఉన్న నిధులను పూర్తిస్థాయిలో వాడుకోవడంపై అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిధుల విడుదలకు అవసరమైన పరిపాలనాపరమైన ప్రక్రియలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శులతో నిరంతరం సమన్వయం సాధించడం ద్వారా నిధుల విడుదలలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించుకోవాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. అవసరమైతే ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులతో తానే స్వయంగా చర్చిస్తానని, సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు.రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర పథకాల ద్వారా గరిష్ట ప్రయోజనాలను పొందడమే లక్ష్యంగా ఈ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీనియర్ అధికారులు మహేశ్ దత్ ఎక్కా, దాన కిశోర్, రాహుల్ బొజ్జా, సందీప్ కుమార్ సుల్తానియా, యోగితా రాణా తదితరులు పాల్గొన్నారు.

మాదాపూర్ సున్నం చెరువు పరిధిలో
అక్రమ బోర్లు

మొదటి పేజీ తరువాయి

మాదాపూర్ సున్నం చెరువు పరిసర ప్రాంతాల్లో ఏళ్లుగా సాగుతున్న అక్రమ నీటి దందాపై హైడ్రా ఉక్కుపాదం మోపింది. రెవెన్యూ, పోలీసుల సహకారంతో జేసీబీల సాయంతో అక్రమ బోర్లను, పైప్ లైన్లను సమూలంగా ధ్వంసం చేసింది.

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. కానీ మాదాపూర్?లోని సున్నం చెరువు పరిధిలో మాత్రం వాటర్ మాఫియా రెచ్చిపోతోంది. ఇళ్ల అవసరాల పేరుతో వందల అడుగుల లోతులో బస్తీ ఇళ్లలో గుట్టుగా బోర్లు వేశారు. భారీ పైపుల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి పెద్ద మోటార్లతో రోజూ లక్షల లీటర్ల నీటిని తోడేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా తోడిన ప్రమాదకర లోహాలు ఉన్న నీటిని ట్యాంకర్ల ద్వారా ఇక్కడి నుంచి చుట్టుపక్కల ప్రాంతాలకు విక్రయిస్తూ వాటర్ మాఫియా కోట్లు గడిస్తోంది. వీళ్లు ఇలా నీటిని తోడేస్తుండటంతో సున్నం చెరువులోకి ఎన్ని వరద నీళ్లు వచ్చినా నిండని పరిస్థితి ఏర్పడింది. చుట్టుపక్కల కాలనీల్లో ఏకంగా వెయ్యి అడుగుల మేర బోర్ వేసినా చుక్క నీరు రావడం లేదని స్థానికులు వాపోతున్నారు.

బోర్లను తొలగించిన హైడ్రా

గతంలో ఎన్నిసార్లు కంప్లైంట్ ఇచ్చినా, అధికారులు వచ్చి బోర్లు సీజ్ చేసి వెళ్లినా మాఫియా తీరు మారలేదు. దీంతో విసుగెత్తిపోయిన జనాలు నేరుగా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. వాటర్ మాఫియా విక్రయిస్తున్న నీటిలో ప్రమాదకర లోహాలు ఉండటంతో పరిస్థితి సీరియస్‌గా తీసుకున్న హైడ్రా 4 టీమ్స్‌తో రంగంలోకి దిగింది. రెవెన్యూ, పోలీసుల సమక్షంలో సున్నం చెరువు పరిసరాల్లో భారీ ఆపరేషన్ చేపట్టింది. జేసీబీల సాయంతో అక్రమ బోర్లను గుర్తించి, వాటర్ మాఫియా ఏర్పాటు చేసిన పైప్ లైన్ నెట్‌వర్క్‌ను పూర్తిగా ధ్వంసం చేసింది. తవ్విన కొద్దీ భారీ ఎత్తున బోర్లు, అండర్ గ్రౌండ్ పైప్ లైన్లు బయటపడుతుండటం చూసి అధికారులు సైతం అవాక్కయ్యారు. దీంతో మళ్లీ తిరిగి వాడటానికి వీల్లేకుండా బోర్లను సమూలంగా తొలగించేశారు.

అధికారులపై చర్యలకు సిద్ధం

రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల బోర్డర్ లో ఉన్న ఈ ఏరియాలో ముఖ్యంగా శేర్లింగంపల్లి మండలం గుట్టల బేగంపేట సర్వే నంబర్ 63లో ఈ అక్రమాలు ఎక్కువగా జరుగుతున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ప్రాథమికంగా 12 అక్రమ బోర్లను గుర్తించి, ఇప్పటికే వాటిలో ఆరింటిని తొలగించారు. కరెంట్ బిల్లుల ఆధారంగా గృహ అవసరాల పేరుతో కమర్షియల్‌గా నీటిని అమ్ముకుంటున్న వారిని పట్టుకుని కఠిన చర్యలు తీసుకునేందుకు రెవెన్యూ శాఖ రెడీ అయింది. పైగా బోర్లు వేసిన మిషన్ల యాజమానులు, వీటికి పర్మిషన్ ఇచ్చిన అధికారులపైనా కూడా యాక్షన్ తీసుకోవడానికి హైడ్రా సిద్ధమైంది.అక్రమ బోర్లపై ఉక్కుపాదం మోపిన హైడ్రాపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. హైడ్రా చెరువుల సుందరీకరణ పనులతో పాటు, ఇలా భూగర్భ జలాలను కాపాడటం వల్ల భవిష్యత్?లో తమ నీటి కష్టాలు తీరుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఎమ్మెల్సీ ఓటర్ నమోదు దరఖాస్తుల అందజేత

చిలుకూరు,మన ప్రజాపక్షం:
చిలుకూరు గ్రామంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించిన సుమారు 150 దరఖాస్తు పత్రాలను బీఆర్ఎస్ పార్టీ చిలుకూరు మండల అధ్యక్షులు అక్కినపల్లి జానకిరామాచారికి స్థానిక బీఆర్ఎస్ నాయకులు చిలుకూరు గ్రామ ఉపసర్పంచ్ బెల్లంకొండ నాగయ్య, పీఏసీఎస్ చైర్మన్ జనార్ధన్, ఎమ్మెల్సీ కోఆర్డినేటర్ మాదారపు శ్రీను, ఎస్.కే.పాషా, తాలూరి శ్రీనివాస్, అల్లి ఉపేందర్ తదితరులు పాల్గొని పట్టభద్రుల ఓటరు నమోదు దరఖాస్తు పత్రాలను అందజేశారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా ఈ దరఖాస్తులను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో
అంతరాయం

చిలుకూరు, మన ప్రజాపక్షం:
చిలుకూరు 33/11 కె.వి సబ్‌స్టేషన్ పరిధిలో సోలార్ విద్యుత్ లైన్ల ఏర్పాటు పనుల కారణంగా ఈ రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చిలుకూరు విద్యుత్ శాఖ ఏఈ (ఆపరేషన్) ఒక ప్రకటనలో తెలిపారు.ఈ అంతరాయం కారణంగా చిలుకూరు సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని



గ్రామాలతో పాటు వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు, రైతులు, పారిశ్రామిక సంస్థల విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. కావున వినియోగదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.సోలార్ విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులను సురక్షితంగా, సకాలంలో పూర్తి చేసేందుకు విద్యుత్ శాఖ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. పనులు పూర్తయ్యే సమయాన్ని బట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో మార్పులు ఉండవచ్చని ఏఈ పేర్కొన్నారు.కార్యకర్తలు పాల్గొన్నారు.



స్వర్ణకార శంఖారావానికి తరలిన జనగామ జిల్లా విశ్వకర్మ స్వర్ణకారులు

జనగామ, మన ప్రజాపక్షం:
విశ్వకర్మ స్వర్ణకారుల హక్కుల సాధన కోసం హైదరాబాద్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు జనగామ జిల్లా విశ్వకర్మ స్వర్ణకార సంఘం నాయకులు మరియు స్వర్ణకారులు పెద్ద ఎత్తున బయలుదేరి వెళ్లారు. స్వర్ణకార శంఖారావం పేరుతో జరుగుతున్న ఈ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి విశ్వకర్మ స్వర్ణకారులు భాగా సంఖ్యలో తరలివెళ్లారు. ?ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం ముఖ్య సలహాదారు నారోజు రామేశ్వర చారి, జనగామ పట్టణ సంఘం అధ్యక్షుడు వలబోజు చక్రపాణి, ప్రధాన కార్యదర్శి సరాబోజు ఆంజనేయులు, కోశాధికారి ఎర్రోజు శ్రవణ్ కుమార్, బచ్చన్నపేట మండల అధ్యక్షుడు వెల్దుర్తి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వలబోజు సాంబయ్య చారి పాల్గొన్నారు. ?వీరితో పాటు సంఘ నాయకులు వలబోజు భాస్కర్ చారి, మేడోజు యాదగిరి, కృష్ణమూర్తి, వలబోజు సత్యనారాయణ, మారోజు బాల నరసయ్య, ఎర్రోజు శ్రవణ్, శిల్పూరు మండల అధ్యక్షుడు శ్రీరామోజు వీరనారాయణ, ఆకోజు వెంకటేశ్వర్లు, మాచర్ల జగన్, చిన్నోజు బ్రహ్మం, పొత్కనూరి కనకాచారి, మండలోజు ప్రభాకర్ తదితరులు ఈ ప్రయాణంలో పాల్గొని హైదరాబాద్ సభకు బయలుదేరి వెళ్లారు.

మారుమూల ప్రాంతాల్లో నేత్ర వైద్య సేవలు అందించడం అభినందనీయం

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:నాగర్ కర్నూల్ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలను చేరువ చేయడానికి కూచుకుళ్ల రామచంద్రారెడ్డి ఐ సెంటర్ ను తూడుకుర్తి గ్రామంలో నెలకొల్పి ప్రజల మన్ననలు పొందేలా ఎల్వీ ప్రసాద్ భాగ్యస్వామ్యంతో అహర్నిశలు అందిస్తుందని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి అన్నారు.గత 28 ఏళ్లుగా ప్రజలకు నేత్ర వైద్య సేవలు అందిస్తున్న సంస్థ మరింత అభివృద్ధి చెందాలని అయన ఆకాంక్షించారు.నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని తూడుకుర్తిలో శనివారం ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు అనుబంధంగా నిర్వహిస్తున్న కూచుకుళ్ల రామచంద్రారెడ్డి ఐ సెంటర్ 28వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ, మారుమూల ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఐ సెంటర్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. కంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా సకాలంలో నేత్ర పరీక్షలు చేయించుకుని, అవసరమైన చికిత్స పొందేలా అవగాహన



కల్పించాలని సూచించారు.తన తండ్రి పేరుతో నిర్వహిస్తున్న నేత్ర వైద్య కేంద్రం ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరడం సంతృప్తినిస్తోందని ఎమ్మెల్సీ తెలిపారు. సంస్థ తన సేవా కార్యక్రమాలను మరింత విస్తరించి, ఎక్కువ మంది ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన నేత్రదానం అందించేందుకు ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి చూపిన చొరవతో ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని కలెక్టర్ కొనియాడారు.ప్రతి మనిషి జీవితంలో కంటి చూపు ఎంతో విలువైనదని అన్నారు.దృష్టి సమస్యలు వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబ, సామాజిక జీవితాలపైనా ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా నేత్ర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముందస్తు పరీక్షల ద్వారా కంటి వ్యాధులను తొలిదశలోనే గుర్తించి, సకాలంలో తగిన చికిత్స పొందవచ్చని తెలిపారు.గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవలు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితుల్లో ఇటువంటి నేత్ర వైద్య కేంద్రాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. వైద్య సేవలు అందించడంతో పాటు కంటి ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. సేవాభావంతో పనిచేస్తున్న వైద్య సంస్థలు తమ సేవలను మరింత విస్తరించి, ఎక్కువ మంది ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగిని ఎంపిక చేసి నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, నాగర్ కర్నూల్ తహసిల్దార్ తబితా రాణి, గ్రామ సర్పంచ్ లక్ష్మి, కరుణాకర్ రెడ్డి, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్యసేవలు అందించాలి

పీఎం రాహత్ పథకం కింద ఆసుపత్రుల నమోదు, ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి
జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:
నాగర్ కర్నూల్ జిల్లాలో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సత్వర వైద్యసేవలు అందించడంతో పాటు, వారికి ఆర్థిక భారం లేకుండా మెరుగైన చికిత్స అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రాహత్ పథకం కింద అర్హత కలిగిన ఆసుపత్రుల నమోదును వేగవంతం చేయాలని, ప్రజలకు ఈ పథకంపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పీఎం రాహత్ పథకం అమలు, విధివిధానాలను వివరించారు. నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు అత్యవసర వైద్యసహాయం అందించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. ప్రమాద బాధితులకు సకాలంలో చికిత్స అందేలా వైద్య ఆరోగ్యశాఖ, పోలీసు, రవాణా, రహదారులు మరియు భవనాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.నాగర్ కర్నూల్ జిల్లాలో పీఎం రాహత్



పథకం కింద వైద్యసేవలు అందించేందుకు 40 ఆసుపత్రులను గుర్తించి, వాటికి అవసరమైన అనుమతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనుమతి పొందిన ఆసుపత్రులు నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రమాద బాధితులను సమీపంలోని పథకానికి అనుబంధంగా ఉన్న ఆసుపత్రులకు తరలించి, ఎలాంటి జాప్యం లేకుండా అత్యవసర వైద్యసేవలు అందించాలని తెలిపారు. పథకం అమలుకు సంబంధించిన విధివిధానాలను ఆసుపత్రుల యాజమాన్యాలకు వివరించి, అవసరమైన ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.పీఎం రాహత్ పథకం నిబంధనల ప్రకారం అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులకు గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్యచికిత్స అందించే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ పథకం ద్వారా అందించే వైద్యసేవలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు సహాయం అందించేందుకు అత్యవసర సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. 24 గంటల్లో ఎఫ్ఐఆర్ నమోదయ్యేలా పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు.ముఖ్యంగా ప్రమాదం జరిగిన ఏడు రోజుల వ్యవధిలోనే నమోదుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.పీఎం రాహత్ పథకం దుర్వినియోగం కాకుండా పోలీసు, రహదారులు మరియు భవనాల శాఖ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పకడ్బందీ పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పథకం అమలులో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన బాధితులకు ప్రయోజనాలు అందేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రమాదాల్లో గాయపడిన బాధితుల చికిత్సకు పీఎం రాహత్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు వైద్య ఖర్చులను భరిస్తుందని తెలిపారు. అంతకు మించి వైద్య ఖర్చులు అవసరమైన సందర్భాల్లో వర్తించే నిబంధనలు, అర్హతల ప్రకారం ఆరోగ్యశ్రీ వంటి రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాల ద్వారా వైద్యసేవలు అందించే అవకాశాలను పరిశీలించి, బాధితులకు తగిన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ, ఆర్ అండ్ బీ ఈఈ శ్రీధర్, ఎన్ఐసీ కోఆర్డినేటర్లు హర్షద్, మధు, ఆర్టీఓ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పిసిఎస్ఎపి ద్వారానే వరి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలి
రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్య

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
నాగర్‌కర్నూల్ జిల్లాలో 2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం కొనుగోళ్లను ప్రొక్యూర్‌మెంట్ సెంటర్ సెల్ఫ్ అసెస్‌మెంట్ పోర్టల్ ద్వారానే నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్య అధికారులను ఆదేశించారు.శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమీక్ష సమావేశ మందిరంలో నిర్వహించిన వరి ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 20 మండలాల పరిధిలో 183 కొనుగోలు కేంద్రాలను వరి కొనుగోలుకు సిద్ధం చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చే రైతులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా తగిన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.రైతులు ధాన్యాన్ని బాగా ఆరబెట్టి, చెత్త, తాలు, మట్టి, రాళ్లు లేకుండా





శుభ్రపరిచి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ధాన్యంలో తేమ శాతం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461, కనీస మద్దతు ధరగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు సన్న రకాల ధాన్యానికి క్వింటాలుకు రూ.500 అదనపు బోనస్ అందించే విధానం ఉందని తెలిపారు.కొనుగోలు కేంద్రాల్లో తూకం యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు, టార్పాలిన్లు, తాగునీరు సహా అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రాన్ని జియో ట్యాగింగ్ చేసి, కేంద్రాల వివరాలు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఫొటోలు, ఆధారాలను పిసిఎస్ఏపీ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.ధాన్యం రవాణా, నిల్వకు అవసరమైన గిడ్డంగి సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని, వాహనాల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ, రైతులకు కనీస మద్దతు ధర సకాలంలో అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను పర్యవేక్షిస్తూ రైతులకు అవసరమైన ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల ఇన్చార్జీలు, మిల్లర్ల సంఘాల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

సూర్యాపేట, మన ప్రజాపక్షం:ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు పక్కాగా అందాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఆత్మకూర్(ఎస్) మండలం మిడ్తనపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్, ప్రైమరీ హైస్కూల్ ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోకి వెళ్లిన కలెక్టర్, విద్యార్థులతో నేరుగా సంభాషించారు. పాఠ్యాంశాలపై వారిని పలు ప్రశ్నలు అడిగి, వారి సందేహాలను ఎంతో ఓపిగ్గా నివృత్తి చేశారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.అనంతరం పాఠశాలలోని వంట గదిను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యత, పారిశుద్ధ్య ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పరిశుభ్రమైన, పౌష్టికాహారాన్ని మాత్రమే వడ్డించాలని, వంటకాల తయారీలో ఎలాంటి అలసత్వం వహించవద్దని నిర్వాహకులకు స్పష్టం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలో ఏవైనా మౌలిక సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు.కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి విశాల్, తహసిల్దార్ హమీన్ సింగ్, ఎంఈఓ ధారాసింగ్, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



విబి-జీ రామ్ జీ పథకం కింద కరువు ప్రభావిత మండలాలకు విస్తృతంగా ఉపాధి కల్పించాలి

నవంబర్ నుంచి మార్చి వరకు అత్యధిక పనిదినాలు కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేయాలి
జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
నాగర్‌కర్నూల్ జిల్లాలో విబి-జీ రామ్ జీ పథకం కింద కూలీలకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించి, అత్యధిక పనిదినాలు సృష్టించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ దేవ సహాయం సమక్షంలో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, ఉద్యానవన, మార్కెటింగ్, సహకార, పశుసంవర్ధక శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధి పనుల పురోగతి, కరువు ప్రభావిత మండలాల్లో పనుల గుర్తింపు, వివిధ శాఖల సమన్వయం, పనుల మంజూరు తదితర అంశాలను సమీక్షించారు.ఈ ఏడాది నవంబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు గరిష్ఠ సంఖ్యలో కూలీలకు ఉపాధి కల్పించేలా గ్రామపంచాయతీలు, మండలాల వారీగా పనిదినాల లక్ష్యాలను నిర్దేశించుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా కరువు ప్రభావిత మండలాల్లో ఉపాధి పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, కూలీల నుంచి వచ్చిన పని డిమాండ్లను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రతి గ్రామపంచాయతీలో చేపట్టేందుకు సిద్ధంగా ఉన్న పనులను గుర్తించి, అవసరమైన అంచనాలు రూపొందించి, సాంకేతిక మరియు పరిపాలనా అనుమతులను త్వరితగతిన పొందాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన పి-1జాబితాలోని 80 పనుల్లో అధిక సంఖ్యలో కూలీలు అవసరమయ్యే 47 పనులకు ప్రత్యేక ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఈ పనుల ప్రస్తుత స్థితి, అంచనా పనిదినాలు, ప్రారంభానికి సిద్ధంగా ఉన్న తేదీలతో సమగ్ర వివరాలు సిద్ధం చేయాలన్నారు.ప్రతి గ్రామపంచాయతీలో కనీసం రెండు పనులు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించాలని, నవంబర్‌లోనే ప్రారంభించగల పనులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మండలాల వారీగా నెలవారీ పనిదినాల లక్ష్యాలను నిర్దేశించి, వ్యవసాయ పనుల రద్దీ కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఉపాధి కల్పన ప్రణాళికను అమలు చేయాలని సూచించారు.సాగునీటి శాఖ ఆధ్వర్యంలో కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, మైనర్లు, ఫీల్డ్ ఛానళ్లలో పూడికతీత పనులు చేపట్టే అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. భూగర్భ జలవనరుల అభివృద్ధి, చెక్‌డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు, పెర్కొలేషన్ ట్యాంకులు, వర్షపు నీటి సంరక్షణకు సంబంధించిన పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, అటవీ, గ్రామీణ నీటి సరఫరా శాఖలు తమ పరిధిలో పథకం కింద చేపట్టదగిన పనులను గుర్తించి, డిసెంబర్ 31లోపు ప్రారంభించగల పనుల వివరాలను అందించాలని సూచించారు.రైతులకు ప్రయోజనం కలిగించే వ్యవసాయ కుంటలు, భూమి అభివృద్ధి, పొలాల గట్ల నిర్మాణం, పండ్ల తోటలు, మొక్కల పెంపకానికి గుంతల తవ్వకం, పశువులు, గొర్రెల షెడ్లు, చెరువుల పూడికతీత వంటి పనులను చేపట్టడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచాలని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జాబ్‌కార్డులతో అనుసంధానించే అవకాశాలను పరిశీలించాలని, అర్హులైన లబ్ధిదారులకు ఉపాధి కల్పించేలా గృహ నిర్మాణ శాఖ, ఉపాధి హామీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాలు, చెంచు పెంటలు, గిరిజన గ్రామపంచాయతీల్లో జాబ్‌కార్డుల జారీ, పని డిమాండ్ నమోదు, కూలీలకు పనుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.స్వయం సహాయక సంఘాల సభ్యులు, కూలీల బృందాలు, మేటీల సహకారంతో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచాలని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు ఈ ఏడాది ఉపాధి పనుల్లో పాల్గొనని అర్హులైన కుటుంబాలను గుర్తించి పనుల్లో భాగస్వాములను చేయాలని సూచించారు.చెంచు, ఇతర గిరిజన కుటుంబాలు, దివ్యాంగ కార్మికులు, వలస వెళ్లే అవకాశం ఉన్న కుటుంబాలకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు.కూలీలకు వేతనాల చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చూడాలని, పనుల కొలతలు, మెజర్‌మెంట్ బుక్ (ఎంబీ) నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బయోమెట్రిక్, డిజిటల్ హాజరు నమోదులో ఉన్న లోపాలు, సిబ్బంది ఖాళీలు, సాంకేతిక అనుమతుల పెండింగ్ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు.కూలీలు పని కోరిన తేదీ నుంచి వర్తించే 15 రోజుల గడువులోగా ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని, గడువు ఉల్లంఘించే ప్రమాదం ఉన్న కేసులను ముందుగానే గుర్తించి పరిష్కరించాలని స్పష్టం చేశారు. గ్రామపంచాయతీల వారీగా వేతనాల చెల్లింపులు, పనుల కొలతలు, పెండింగ్ పని డిమాండ్లు, అందుబాటులో ఉన్న పనుల వివరాలతో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిని ఆదేశించారు.బాచారం ఏటీఆర్ పునరావాస పనులకు సంబంధించి సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ), తాగునీటి సరఫరా పనులు ప్రారంభం కాకపోవడానికి గల ఖచ్చితమైన కారణాలను వివరిస్తూ అత్యవసర స్థితిగతుల నివేదికను సమర్పించాలని ఈఈ పీఆర్‌అండ్‌ఆర్‌డీ,ఈఈ ఎంబీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.పనుల ప్రారంభంలో జాప్యానికి దారితీసిన అడ్డంకులు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను నివేదికలో స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. తన స్పష్టమైన లిఖితపూర్వక అనుమతి లేకుండా ఈ పనులకు సంబంధించిన టెండర్లను రద్దు చేయడం లేదా వాటిలో మార్పులు చేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, నివేదికను సకాలంలో సమర్పించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డీఆర్‌డీఓ అదనపు పీడీ రాజేశ్వరి, జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటేశం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జ్ఞానశేఖర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీ-2024 ఎస్జీటీ ఉపాధ్యాయులకు రెండో వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేయాలి


ఇంక్రిమెంట్ కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులు...విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి



అమ్రాబాద్,మన ప్రజాపక్షం:తెలంగాణ రాష్ట్రంలో డీఎస్సీ-2024 ద్వారా నియమితులై, 2024 అక్టోబర్ 10న విధుల్లో చేరిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు రెండో వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు.విధుల్లో చేరి రెండేళ్ల సేవా కాలం పూర్తయిన నేపథ్యంలో, నిబంధనల ప్రకారం తమకు రావాల్సిన రెండో వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు కావాలని ఉపాధ్యాయులు,ఎదురుచూస్తున్నారు. అయితే, అర్హత కలిగినప్పటికీ ఇంక్రిమెంట్ మంజూరు విషయంలో స్పష్టత లేకపోవడం, ప్రక్రియలో జాప్యం జరుగుతుందనే ఆందోళన వారిలో నెలకొంది.విధుల్లో చేరిన నాటి నుంచి క్రమశిక్షణతో బాధ్యతలు నిర్వహిస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న తమకు, నిబంధనల ప్రకారం లభించాల్సిన ఆర్థిక ప్రయోజనాల విషయంలో జాప్యం జరగడం బాధాకరమని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సర్వీస్ రికార్డులను పరిశీలించి, అర్హతను నిర్ధారించి, ఇంక్రిమెంట్ మంజూరు చేయడానికి అధికారులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.అధికారులు ఇప్పటికైనా స్పందించాలని, విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, డీఎస్సీ-2024 ద్వారా నియమితులైన ఎస్జీటీ ఉపాధ్యాయుల సర్వీస్ రికార్డులను వెంటనే పరిశీలించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. వర్తించే సర్వీస్ నిబంధనల ప్రకారం అర్హులైన వారందరికీ రెండో వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేసి, తమ సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఇంక్రిమెంట్ మంజూరుపై అధికారుల నుంచి స్పష్టమైన చర్యలు వెలువడాలని, తమకు రావాల్సిన ప్రయోజనాల కోసం మరింత కాలం ఎదురుచూడాల్సిన పరిస్థితి రాకూడదని ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణమ్మ ఒడ్డున ఉన్నా...రైతులకు కన్నీళ్లేనా?

60 ఏళ్లుగా హామీలే తప్ప సాగునీరు లేదు!
అమ్రాబాద్ ఉమ్మడి మండలానికి సాగునీరు అందించాలి
మరో ప్రజా ఉద్యమానికి సిద్ధం కావాలి



అమ్రాబాద్,మన ప్రజాపక్షం:
అంగట్లో అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్నట్లుగా అమ్రాబాద్ ఉమ్మడి మండల ప్రజల పరిస్థితి మారిందని, చుట్టూ కృష్ణమ్మ ప్రవహిస్తున్నా తమ పొలాలకు సాగునీరు అందక రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని స్థానిక ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు సమీపంలో కృష్ణా నది పరివాహక ప్రాంతంలో ఉన్న తమకు ఆరు దశాబ్దాలుగా నాయకుల హామీలే తప్ప సాగునీరు అందకపోవడం దురదృష్టకరమని వారు మండిపడ్డారు.80 కిలోమీటర్ల పరిధిలో కృష్ణమ్మ ప్రవహిస్తున్న మా పొలాలకు నీరేది?శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నీరు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నా, నది ఒడ్డున ఉన్న అమ్రాబాద్ ఉమ్మడి మండల రైతులకు మాత్రం సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెన్నైకి, పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమ ప్రాంతాలకు నీరు తరలించే ప్రణాళికలు అమలవుతున్నాయని, కానీ తమ ప్రాంత రైతుల సాగునీటి సమస్యకు మాత్రం శాశ్వత పరిష్కారం చూపడం లేదని ప్రశ్నించారు.ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే మా ప్రాంతం వారే.. అయినా మా కరువు గోస కనిపించడం లేదా?ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఇటీవల జరిగిన సాగునీటి సమీక్షలో ఇప్పటికే అధిక శాతం సాగునీటి సౌకర్యం ఉన్న నల్గొండ జిల్లా అంశాలపై దృష్టి సారిస్తున్నారని, తరతరాలుగా కరువుతో అల్లాడుతున్న అమ్రాబాద్ ఉమ్మడి మండలానికి సాగునీరు అందించే అంశానికి తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం బాధాకరమని నాయకులు పేర్కొన్నారు.ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఇద్దరూ ఈ ప్రాంతానికి చెందినవారే అయినప్పటికీ, తమ ప్రాంత సాగునీటి సమస్యకు పరిష్కారం లభించకపోవడం ప్రజలను నిరాశకు గురిచేస్తోందన్నారు. మా కరువు గోస పాలకులకు కనిపించడం లేదా? మా రైతుల కన్నీళ్లు వినిపించడం లేదా? అని ప్రశ్నించారు.నాడు ఆంధ్ర పాలకుల వివక్ష అన్నారు.. నేడు తెలంగాణలోనూ అదే పరిస్థితా? గతంలో దుందుభి వాగు, నక్కలగండి, నార్లాపూర్, ఏదుల వంటి ప్రాజెక్టులు, ప్రతిపాదనల పేర్లు వినిపించాయని, కాలం గడుస్తున్నా తమ ప్రాంతానికి సాగునీరు అందించే శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో సాగునీరు రాకపోవడానికి ఆంధ్ర పాలకుల వివక్ష కారణమని చెప్పారని, ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, స్థానిక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగాల్సిన సమయంలోనూ తమకు నీరు ఎందుకు రావడం లేదని నిలదీశారు. నాడు ఆంధ్ర వివక్షకు గురయ్యామని, నేడు తెలంగాణలోనూ వివక్షకు గురికావాలా? అని ప్రశ్నించారు.యురేనియం వ్యతిరేక పోరాటం తరహాలో సాగునీటి ఉద్యమం చేపడదాం!అమ్రాబాద్ ఉమ్మడి మండల ప్రజలు, రైతులు, యువకులు, ప్రజాసంఘాల నాయకులు రాజకీయాలకు అతీతంగా ఒక్కటై సాగునీటి హక్కుల కోసం మరో ప్రజా ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. యురేనియం వ్యతిరేక పోరాటంలో ప్రజలు ఏకమై తమ నిరసనను బలంగా వినిపించినట్లుగానే, సాగునీటి సాధన కోసం కూడా ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.ప్రభుత్వం తక్షణమే అమ్రాబాద్ ఉమ్మడి మండల సాగునీటి అవసరాలపై సమగ్ర ప్రణాళిక రూపొందించి, నిధులు కేటాయించి, ప్రాజెక్టుల పనులకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇకపై హామీలతో కాలయాపన చేయకుండా, తమకు సాగునీరు అందించే విషయంలో తాడోపేడో తేల్చుకునేలా ప్రజలంతా ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ సమావేశంలో జక్కా బాలకిష్టయ్య (అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి), తెలంగాణ జేఏసీ శ్రీనివాస్, విజయమోహన్, జక్కా బాలయ్య, సామ అనిల్, గాజుల చిన్నకిష్టయ్య, రైతులు జక్కా రామయ్య, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



నీటి సంరక్షనే లక్ష్యం... ప్రత్యేక అధికారి సత్యనారాయణ

చిలుకూరు,మన ప్రజాపక్షం:
చిలుకూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి జె.సత్యనారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షపాతం తగ్గడం, నీటి లభ్యతపై పడే ప్రభావాన్ని ఎదుర్కొనే ముందస్తు చర్యలపై చర్చించారు.విబ్ జిరామ్‌జీ జలసిరి పనుల పురోగతిని సమీక్షించి, నీటి వనరులు, సాగునీటి సదుపాయాలు, వర్షపు నీటి సంరక్షణ, చెరువులు, కాలువల అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. తాగునీటి వనరుల పరిరక్షణ, నీటి వృథా నివారణ, అవసరమైన చోట ప్రత్యామ్నాయ నీటి సరఫరా, ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్యుత్, వ్యవసాయం, పాఠశాలలు, గ్రామీణాభివృద్ధి సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులకు అందేలా చర్యలు, పెండింగ్ పనుల త్వరితగతిన పూర్తి చేయడంపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు.ఈ సమావేశంలో ఎంపీడీవో ముక్కపాటి నరసింహారావు, తహసీల్దార్ ధ్రువకుమార్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు,మండలంలోని గ్రామసర్పంచులు,వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భూ అక్రమాలపై ముగ్గురు రెవెన్యూ అధికారుల సస్పెన్షన్



హుజూర్ నగర్,మన ప్రజాపక్షం:
భూముల లావాదేవీల్లో తీవ్ర అవకతవకలు, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు రెవెన్యూ అధికారులపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ కఠిన చర్యలు తీసుకున్నారు.హుజూర్ నగర్ తహసీల్దార్ బి.కవిత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కాశీం షరీఫ్, గ్రామ పాలన అధికారి (జీపీవో) ఎస్.కె. జానీ పాషాలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శాఖాపరమైన విచారణ పెండింగ్‌లో ఉండగానే ఈ చర్యలు చేపట్టారు.

రికార్డులు పరిశీలించకుండానే లావాదేవీలు

హుజూర్‌నగర్ గ్రామం, మండల పరిధిలోని సర్వే నంబర్లు 458, 281లో భూముల లావాదేవీలకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. హుజూర్‌నగర్ ఆర్డీవో సమర్పించిన నివేదికల ఆధారంగా ఈ వ్యవహారాన్ని జిల్లా యంత్రాంగం తీవ్రంగా పరిగణించింది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్పీ) సాగునీటి కాలువలకు సంబంధించిన భూములు, భూసంస్కరణల చట్టం పరిధిలోని భూముల విషయంలో పాత రెవెన్యూ రికార్డులు, గతంలో జరిగిన విచారణలు, న్యాయస్థానాల ఉత్తర్వులను పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు.

జనగామలో స్వచ్ఛత దిశగా మరొక ముందడుగు

చెత్త వేరుచేసే యంత్రం పనులకు భూమిపూజ



జనగామ, మన ప్రజాపక్షం: జనగామ మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డులో తడి, పొడి చెత్తను వేర్వేరు చేయడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న “తడి-పొడి చెత్త వేరుచేసే యంత్రం” పనులకు జనగామ మున్సిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి-శ్రీనివాస్ శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. పట్టణంలో స్వచ్ఛతను పెంపొందించడం, వ్యర్థాల సమర్థ నిర్వహణే లక్ష్యంగా ఈ ఆధునిక యంత్రాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. ?ఈ యంత్రం అందుబాటులోకి రావడం ద్వారా మున్సిపాలిటీ పరిధిలో సేకరించిన చెత్తను సులభంగా వర్గీకరించి, పర్యావరణానికి విఘాతం కలగకుండా పునర్వినియోగానికి పంపడానికి వీలవుతుందని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.



హెడ్ కానిస్టేబుల్ బడే సాబ్ కు ఘన నివాళులు

తిరుమలగిరి,మన ప్రజాపక్షం:
తిరుమలగిరి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో పనిచేసిన హెడ్ కానిస్టేబుల్ బడే సాబుకు శనివారం నాడు ఘన నివాళులు అర్పించారు. నాగారం సిఐ డి.నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో మావోయిస్టులు తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పై కాల్పులు జరిపిన దాడిలో వీరమరణం పొందిన, బడే సాబ్ చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళి అర్పించామని, విధి నిర్వహణలో అమరులైన అమరవీరులందరికీ,రెండు నిమిషాలు శ్రద్ధాంజలి ఘటించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జి.వెంకటరెడ్డి, కానిస్టేబుల్ సుధాకర్ ముదిరాజ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దిమ్మదుర్తిలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి మంజూరు చేయాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

మామడ,మన ప్రజాపక్షం:
మామడ మండలం దిమ్మదుర్తి గ్రామంలో ఇళ్లు లేని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు.శనివారం దిమ్మదుర్తి గ్రామంలో కలెక్టర్ పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి నిబంధనల ప్రకారం ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.గ్రామంలో పలు ఇళ్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో సాంకేతిక సమస్యలు ఉంటే వాటిని వెంటనే గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో విజయ్‌కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



యువత మత్తు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజా ప్రభుత్వం గంజాయి,డ్రగ్స్ అరికట్టేందుకు ఈగల్ టీం ఏర్పాటు చేసింది

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్,మన ప్రజాపక్షం:ఉట్నూర్ మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్లో ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువతకు అవగాహన సదస్సు కార్యక్రమంలో పాల్గొన్న నిర్మల్ డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ యువతను ఉద్దేశించి ప్రసంగించారు ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత మత్తు వ్యసనాలకు దూరంగా ఉండాలి,దురలవాటులతో యువకులు జీవితాలను పాడు చేసుకోవద్దని సూచించారు.ఉన్నత లక్ష్యంతో కష్టపడి ఎదిగి తల్లి తండ్రులకు అండగా నిలుస్తూ సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో గంజాయి,డ్రగ్స్ అరికట్టేందుకు ఈగల్ అనే ప్రత్యేక బృందం పని చేస్తుంది అని యువతను మంచి మార్గంలో నడిపిస్తూ మంచి భవిష్యత్ కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని ఆయన అన్నారు.యువతకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం హర్షణీయం అన్నారు.కార్యక్రమ నిర్వాహకులు ఎమ్మెల్యే ని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు,మరియు సామాజిక కార్యకర్త ముంతాజ్,కాంగ్రెస్ నాయకులు అన్సారీ, ఫహీమ్,పెద్దలు,యువకులు పాల్గొన్నారు.

తిరుమలగిరి పోలీస్ స్టేషన్లో విద్యార్థులకు అవగాహన సదస్సు

పోలీసు అమరవీరుల సంస్మరణ లో భాగంగా తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం

పోలీసు విధులు, నేర పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన



తిరుమలగిరి, మన ప్రజాపక్షం
:పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు, పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా తిరుమలగిరి పోలీస్ స్టేషన్ ఎదుట విద్యార్థులకు పోలీస్ ఓపెన్ హౌస్ కార్యక్రమం శనివారం నాడు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ, జి వెంకట్ రెడ్డి విద్యార్థులకు పోలీసు శాఖ విధులు, నేర పరిశోధన, నేరాల ఛేదనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలీసు విధివిధానాలు, నేరాల పరిశోధన, నేరస్థులను గుర్తించే పద్ధతులు, సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యత, మహిళలు, విద్యార్థులు, బాలల రక్షణలో పోలీసు శాఖ పాత్ర గురించి వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసులను త్వరితగతిన ఛేదించడంలో పోలీసులు అనుసరిస్తున్న విధానాలను విద్యార్థులకు తెలియజేశారు.అదేవిధంగా పోలీసు కమ్యూనికేషన్ వ్యవస్థ, ఫింగర్‌ప్రింట్ పరికరాల పనితీరు, నేరస్థుల డేటాబేస్ నిర్వహణ, నేర పరిశోధనలో వాటి ఉపయోగాల గురించి వివరించారు. నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.ప్రజల ధన, మాన, ప్రాణ, ఆస్తుల రక్షణ కోసం నిరంతరం విధులు నిర్వహిస్తూ, అవసరమైన సందర్భాల్లో ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఎస్ఐ సూచించారు. దేశం, ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించాలని, పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పోలీసుల విధులు, త్యాగాలు, ప్రజల భద్రత కోసం వారు చేస్తున్న సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఓపెన్ హౌస్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ 125 రోజులు పని పొందాలి

వివిజి రామ్ జీ పథకంతో పేదలకు ఆర్థిక భరోసా

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్,మన ప్రజాపక్షం:
వివిజి రామ్ జీ పథకం ద్వారా జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి పనులు పొందాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. పంటల దిగుబడి తగ్గడం, వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గే పరిస్థితుల్లో ఈ పథకం గ్రామీణ పేదలకు ఆర్థికంగా అండగా నిలుస్తుందని తెలిపారు.కడెం మండలం కొండుకూరు గ్రామంలోని ఎస్‌కే ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన జోన్-1 స్థాయి వివిజి రామ్ జీ అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉన్నందున, జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ 125 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పథకం కింద చేపట్టే పనులకు కూలీ డబ్బులు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాల్లో నీటి సంరక్షణ, జలవనరుల అభివృద్ధి వంటి పనులను చేపట్టడం ద్వారా ఉపాధితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపాధి పనుల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే ప్రజల వద్దకే వెళ్లి ఉపాధి పనులపై అవగాహన కల్పించాలని సూచించారు.కార్యక్రమంలో డీఆర్‌డీఓ విజయలక్ష్మి, డీపీఓ శ్రీనివాస్, ఇంజినీరింగ్ అధికారులు సందీప్, తుకారాం, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



భూముల రీసర్వే మొదటి దశ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలి

సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్

నిర్మల్,మన ప్రజాపక్షం:
భూముల రీసర్వే మొదటి దశ ప్రక్రియను వేగవంతం చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.రీసర్వే ప్రక్రియ పురోగతిపై శనివారం సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని అన్నారు.భూ రీసర్వే మొదటి దశలో అన్ని జిల్లాల్లో ఎంపిక చేసిన 70 రెవెన్యూ గ్రామాలలో సర్వే పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సర్వే పనులకు అవసరమైన ప్రణాళిక రూపొందించుకొని, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అవసరమైన సిబ్బంది, సాంకేతిక వనరులు, యంత్ర పరికరాలను సమకూర్చుకొని నిర్ణీత లక్ష్యాలను సాధించాలని సూచించారు. సర్వే పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అదనపు బృందాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. అందుబాటులో ఉన్న సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకుంటూ, పనుల పురోగతికి అనుగుణంగా బృందాలను కేటాయించాలని తెలిపారు. సర్వే సిబ్బందికి అవసరమైన శిక్షణ, సాంకేతిక మార్గదర్శకత్వం అందించి పనులు సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు.గ్రామాల వారీగా సర్వే లక్ష్యాలను నిర్దేశించుకొని, ప్రతిరోజూ చేపట్టిన పనులు, మిగిలి ఉన్న పనుల వివరాలను సమీక్షించాలని చెప్పారు. సర్వే పనుల్లో వెనుకబడిన గ్రామాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక దృష్టి సారించి పనుల వేగం పెంచాలని తెలిపారు.భూ రీసర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. భూ సరిహద్దులకు సంబంధించిన సమస్యలు, భూ రికార్డుల్లో వ్యత్యాసాలు, ఇతర సాంకేతిక ఇబ్బందుల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహణకు ఆటంకాలు ఏర్పడకుండా రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అవసరమైన చోట సంబంధిత భూయజమానులకు సర్వే ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా వాటి పరిష్కారానికి నిర్దిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు.భూ రీసర్వే పనులకు అవసరమైన యంత్ర పరికరాలు, సాంకేతిక పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాలను జిల్లా స్థాయిలో ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. సర్వే బృందాలకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, పరికరాల కొరత కారణంగా పనుల్లో జాప్యం జరగకుండా చూడాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.భూ రీసర్వే పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. భూ రీసర్వే ప్రక్రియ ద్వారా భూములకు సంబంధించిన వివరాలను కచ్చితంగా నమోదు చేసేందుకు, భూ రికార్డుల్లో పారదర్శకత పెంపొందించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అన్ని జిల్లాల్లో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశించిన లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి దశలో చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తామని అన్నారు. జిల్లాలో కొనసాగుతున్న రీ సర్వే ప్రక్రియ వివరాలను కమిషనర్ కు తెలియజేశారు. ఇటీవల అదనపు సర్వే యంత్రాలు సమకూర్చుకున్నట్లు వివరించారు. రీ సర్వే ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని అన్నారు. జిల్లాలో సంబంధిత అధికారుల సమక్షంలో రీ సర్వే ప్రక్రియ సజావుగా జరుగుతుందని చెప్పారు. అధికారులంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి సర్వేను కొనసాగిస్తున్నారని తెలిపారు.ఈ వీసీలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, ఏడి ల్యాండ్ సర్వే రికార్డ్ విఠల్, ఇతర





అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖల నిర్మాణాలకు ఆమోదిత ఇసుకను మాత్రమే వాడాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్,మన ప్రజాపక్షం:
జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే నిర్మాణాలన్నింటికీ ప్రభుత్వ ఆమోదిత ఇసుక మాత్రమే వినియోగించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, వివిధ శాఖల అభివృద్ధి పనులు, నిర్మాణాలలో ఇసుక వినియోగంపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి పనికి చట్ట ప్రకారం మాత్రమే ఇసుకను పొందాలన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడే విధంగా ఇతర మార్గాల్లో ఇసుక సేకరించి వాడటాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని అన్నారు. నిర్మాణ పనులకు ఇసుకను పొందే మార్గాలపై ఆయా శాఖల ఉన్నతాధికారులు పర్యవేక్షణ ఉంచాలని అన్నారు. నాసిరకం ఇసుక వాడటం వల్ల నిర్మాణాల్లో నాణ్యత లోపాలు తలెత్తుతాయని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు కూడా పారదర్శకంగా ఇసుక పొందాలని చెప్పారు. ఆయా నిర్మాణ పనుల్లో ఇసుక కొరత తలెత్తకుండా చూడాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, మైనింగ్ అధికారి తిరుపతి రావు, ఆర్ అండ్ బి, నీటిపారుదల శాఖల ఈఈ లు సుభాష్, అనిల్, హౌసింగ్ పిడి శ్రీనివాస్, సిపిఓ గంగారెడ్డి, ఈడబ్ల్యుఐడిసి డిప్యూటీ ఈఈ గంగాధర్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఫిన్‌లాండ్ అంతర్జాతీయ విద్యా అధ్యయన పర్యటనకు జిల్లా నుంచి ఇద్దరు ఉపాధ్యాయుల ఎంపిక

జిల్లా విద్యాశాఖాధికారి హర్షం





నారాయణపేట, మన ప్రజాపక్షం:
తెలంగాణ ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులలో అంతర్జాతీయ స్థాయి బోధనా నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఉపాధ్యాయుల ఫిన్‌లాండ్ విద్యా అధ్యయన పర్యటన- 2026 కు నారాయణపేట జిల్లా నుండి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ అధ్యయన పర్యటనకు ఎంపికైన వారిలో కల్వల్ శ్రీకాంత్ -సెకండరీ గ్రేడ్ టీచర్,ఎంపీపీఎస్ గోలపల్లి, మక్తల్ మండలం,సభా సుల్తానా- స్కూల్ అసిస్టెంట్ ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యా విధానంగా గుర్తింపు పొందిన ఫిన్‌లాండ్‌లోని 'యూనివర్సిటీ ఆఫ్ తుర్కు' మరియు 'యూనివర్సిటీ ఆఫ్ హెల్సింకి' ఆధ్వర్యంలో ఈ ప్రతిష్టాత్మక శిక్షణా కార్యక్రమం జరగనుందని పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత పాఠశాల స్థాయి వరకు విద్యార్థి-కేంద్రీకృత బోధన, పరీక్షల ఒత్తిడి లేని నిర్మాణాత్మక మూల్యాంకనం, సామర్థ్యాల ఆధారిత విద్యా విధానం మరియు సమ్మిళిత తరగతి గది నిర్వహణ వంటి అంశాలపై వీరు ప్రత్యక్ష పరిశీలన జరపనున్నారని వివరించారు.తరగతి గదిలో వినూత్న బోధనా పద్ధతులను అమలు చేస్తూ, విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తున్నందుకు గాను వీరిద్దరూ రాష్ట్ర స్థాయిలో ఎంపిక కావడం నారాయణపేట జిల్లా విద్యాశాఖకే గర్వకారణమని డీఈఓ కొనియాడారు.ఈ అంతర్జాతీయ అధ్యయన పర్యటన ముగించుకుని వచ్చిన అనంతరం, వీరు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరిస్తూ ఫిన్‌లాండ్‌లో గమనించిన ఉత్తమ బోధనా విధానాలు మరియు నూతన విద్యా దృక్పథాలను జిల్లాలోని తోటి ఉపాధ్యాయులతో పంచుకుంటారని తెలిపారు. తద్వారా మన ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.అంతర్జాతీయ వేదికపై జిల్లా కీర్తిని చాటేందుకు ఎంపికైన ఉపాధ్యాయులు కల్వల్ శ్రీకాంత్,సభా సుల్తానాలకు ఏఎంఓ విద్యాసాగర్ ,జిల్లా విద్యాశాఖ అధికారులు, సెక్టోరల్ అధికారులు, ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం తరపున హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థుల ప్రతిభకు ముగ్ధుడైన డీఈఓ... విజేతలకు అభినందనలు, ప్రోత్సాహం!

జిల్లా స్థాయి పీఎం శ్రీ పాఠశాలల పోటీల్లో విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన

మాక్ పార్లమెంట్, స్పెల్ బీ, క్విజ్ పోటీల్లో విజేతలకు అభినందనలు తెలిపిన డీఈఓ

నారాయణపేట,మన ప్రజాపక్షం:
నారాయణపేట జిల్లా పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పీఎం శ్రీ పాఠశాలల పోటీలు శనివారం జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం, నాయకత్వ లక్షణాలు, భాషా నైపుణ్యాలు, తార్కిక ఆలోచనా సామర్థ్యం, సాధారణ జ్ఞానం, ఆత్మవిశ్వాసం పెంపొందించడం లక్ష్యంగా మాక్ పార్లమెంట్, స్పెల్ బీ, క్విజ్ పోటీలను నిర్వహించారు.ఈ పోటీల్లో వివిధ పీఎం శ్రీ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పాఠ్యాంశాలపై అవగాహనతో పాటు సమయస్ఫూర్తి, బృంద సమన్వయం, సమస్యలను విశ్లేషించే సామర్థ్యం, వేదికపై ధైర్యంగా తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే నైపుణ్యాలను చాటుకున్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి డా. ఎం.గోవిందరాజు విద్యార్థుల ప్రతిభను అభినందించారు. విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందించాలని పేర్కొన్నారు. ఇలాంటి పోటీలు విద్యార్థులకు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశాన్ని కల్పించడంతో పాటు, పోటీ తత్వాన్ని ఆరోగ్యకరంగా స్వీకరించడం, ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం, క్రమశిక్షణతో వ్యవహరించడం, విజయాపజయాలను సమానంగా స్వీకరించడం వంటి విలువలను నేర్పుతాయని తెలిపారు.పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తూ, మిగిలిన విద్యార్థులు కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. బహుమతులు సాధించడం ఎంత ముఖ్యమో, పోటీల్లో పాల్గొని కొత్త విషయాలను నేర్చుకోవడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్ల సేవలను ప్రశంసించారు. మాక్ పార్లమెంట్ పోటీలు విద్యార్థుల్లో ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన, నాయకత్వ లక్షణాలు, సభా నిర్వహణ, చర్చా నైపుణ్యాలు, సమాజం పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించారు. విద్యార్థులు ప్రజాస్వామ్య విలువలు, పరస్పర గౌరవం, క్రమశిక్షణ, అభిప్రాయ



వ్యక్తీకరణ వంటి అంశాల ప్రాముఖ్యతను చాటుకున్నారు. ప్రథమ స్థానం కొండాపూర్ టీజీటీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాలకు చెందిన ఆర్. ప్రవీణ్ ప్రథమ స్థానాన్ని సాధించారు.ద్వితీయ స్థానం మరికల్ టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలకు చెందిన సాత్విక ద్వితీయ స్థానాన్ని సాధించారు.విజేతలను డీఈఓ అభినందిస్తూ, విద్యార్థులు సమాజంలోని సమస్యలపై అవగాహన పెంపొందించుకొని, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. మాక్ పార్లమెంట్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వం, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో విద్యార్థులు సాధారణ జ్ఞానం, విషయ పరిజ్ఞానం, తార్కిక ఆలోచనా సామర్థ్యాన్ని ప్రదర్శించారు. వివిధ అంశాలకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడంలో చురుకుదనాన్ని కనబరిచారు. ప్రథమ బహుమతి పీఎం శ్రీ బాలికల పాఠశాల, ఉట్కూర్‌కు చెందిన కె. స్పందన (10వ తరగతి), వి. దీక్షిత (8వ తరగతి) ప్రథమ బహుమతిని సాధించారు. ద్వితీయ బహుమతి పీఎం శ్రీ వడ్‌వట్ పాఠశాలకు చెందిన జి. గౌతమ్ (8వ తరగతి) ద్వితీయ బహుమతిని సాధించారు.క్విజ్ పోటీల్లో విజేతలను డీఈఓ అభినందిస్తూ, విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, దినపత్రికలు చదవడం ద్వారా సమకాలీన అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. నిరంతర అభ్యాసం, జిజ్ఞాస, సాధన విజయానికి మార్గాలని పేర్కొన్నారు.స్పెల్ బీ పోటీల్లో విద్యార్థులు ఆంగ్ల పదజాలం, పదాల సరైన స్పెల్లింగ్, ఉచ్చారణపై తమ పట్టు ప్రదర్శించారు. భాషా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి ఇటువంటి పోటీలు ఎంతో ఉపయోగకరమని అధికారులు పేర్కొన్నారు.ప్రథమ బహుమతి: పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల, ఉట్కూర్‌కు చెందిన కె. రిషిక (8వ తరగతి), మౌనిక (9వ తరగతి) ప్రథమ బహుమతిని సాధించారు. ద్వితీయ బహుమతి పీఎం శ్రీ టీఎస్ఎంఎస్ గుండుమల్ పాఠశాలకు చెందిన జి. ప్రవస్తి (7వ తరగతి), కె. హారిక (10వ తరగతి) ద్వితీయ బహుమతిని సాధించారు.విజేతలను డీఈఓ అభినందిస్తూ, ఆంగ్ల భాషపై పట్టు సాధించడానికి ప్రతిరోజూ చదవడం, కొత్త పదాలను నేర్చుకోవడం, వాటి అర్థాలను తెలుసుకోవడం, సరైన ఉచ్చారణతో ఉపయోగించడం వంటి అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు.జిల్లా స్థాయి పోటీల విజయవంతమైన నిర్వహణలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు, కార్యక్రమ నిర్వాహకులు కీలక పాత్ర పోషించారు. విద్యార్థులను పోటీలకు సిద్ధం చేయడం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, అవసరమైన మార్గదర్శకత్వం అందించడం వంటి అంశాల్లో ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమని డీఈఓ పేర్కొన్నారు.విద్యార్థుల సమగ్ర వికాసానికి పాఠ్యాంశాలతో పాటు సహపాఠ్య, సృజనాత్మక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించడం ఉపాధ్యాయుల బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి విద్యాసాగర్, జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, కార్యక్రమ సమన్వయకర్త కనకప్ప, ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు, విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి పీఎం శ్రీ పాఠశాలల పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు, వారిలో పోటీ స్ఫూర్తి, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, నేర్చుకోవాలనే ఆసక్తిని పెంపొందించే వేదికగా నిలిచాయి. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అధికారులు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు లైజన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ డి.జానకి

కేసుల విచారణలో సమన్వయం, నేర నిరూపణలో పటిష్టమైన ఆధారాలు కీలకం

పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలి

సాక్షుల హాజరు, చార్జిషీట్ల దాఖలు, కోర్టు విచారణల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలి

మహబూబ్ నగర్, మన ప్రజాపక్షం:
మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.జానకి కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు లైజన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు, విచారణల పురోగతి, నేర నిరూపణకు తీసుకోవాల్సిన చర్యలు, పోలీసు అధికారులు మరియు ప్రాసిక్యూషన్ మధ్య సమన్వయం తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో దర్యాప్తు అధికారులు సేకరించిన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, సంబంధిత పత్రాలు చట్టపరమైన నిబంధనల ప్రకారం కోర్టులో సమర్థవంతంగా ప్రవేశపెట్టేలా కోర్టు డ్యూటీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కేసుల విచారణలో ఎలాంటి జాప్యం జరగకుండా, కోర్టు విధించిన గడువులు, ఆదేశాలను పాటిస్తూ విధులు నిర్వహించాలని తెలిపారు.పెండింగ్ కేసులను నిరంతరం



సమీక్షిస్తూ, ప్రతి కేసు ప్రస్తుత స్థితి, తదుపరి విచారణ తేదీ, సాక్షుల హాజరు, సమన్లు, వారెంట్ల అమలు తదితర అంశాలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి సంబంధిత అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. కోర్టుకు హాజరుకావాల్సిన సాక్షులు, దర్యాప్తు అధికారులు సకాలంలో హాజరయ్యేలా సమన్వయం చేసుకోవాలని, ముఖ్యంగా మహిళలు, చిన్నారులపై నేరాలు, పోక్సో కేసులు, తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.కేసుల దర్యాప్తు పూర్తయిన వెంటనే చట్టపరమైన నిబంధనల ప్రకారం చార్జిషీట్లు దాఖలు చేయడం, కోర్టు విచారణలో అవసరమైన ఆధారాలు, పత్రాలు అందుబాటులో ఉండేలా చూసుకోవడం, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో నిరంతరం సమన్వయం చేసుకోవడం అత్యంత ముఖ్యమని ఎస్పీ పేర్కొన్నారు.నేరం చేసిన వారికి చట్టప్రకారం శిక్ష పడేలా ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాల సేకరణ, సమర్థవంతమైన కోర్టు సమన్వయం అవసరమని తెలిపారు. కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు లైజన్ అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను జవాబుదారీతనంతో నిర్వర్తిస్తూ, కేసుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.ప్రజలకు సత్వర న్యాయం అందేలా, నేరస్తులకు శిక్ష పడేలా పోలీస్ శాఖలోని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ డి.జానకి సూచించారు.ఈ సమావేశం నందు వర్టికల్ డిఎస్పీ బాలాజీ, ఇన్స్పెక్టర్లు మోతిరం, గోవింద రెడ్డి, కోర్టు డ్యూటీ అధికారులు మరియు కోర్టు లైసెన్ అధికారులు పాల్గొన్నారు.



ఘనంగా పోలీసు అమరవీరుల వారోత్సవాల అవగాహన కార్యక్రమం

జనగామ, మన ప్రజాపక్షం:
పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ మరియు జనగామ డీసీపీ రాజా మహేంద్ర నాయక్, ఐపీఎస్ ఆదేశాల మేరకు శనివారం జనగామ పట్టణంలో కళాబృందం ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ?విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను, వారు సమాజానికి అందించిన సేవల ప్రాముఖ్యతను ప్రజలందరికీ తెలియజేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ?ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలలో కళాకారులు నాటికలు, గేయాలు మరియు ఉత్తేజభరితమైన పాటల రూపంలో పోలీసు అమరవీరుల ధైర్యసాహసాలను, అంకితభావాన్ని కళ్లకు కట్టినట్లు వివరించారు.?శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న కృషిని, సమాజ రక్షణ కోసం వారు చేసే త్యాగాలను వివస్తూ, అమరవీరుల ఆశయాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ప్రజలకు అవగాహన కల్పించారు.





పట్టుబడిన గంజాయిని ధ్వంసం చేసిన పోలీసులు

వరంగల్, మన ప్రజాపక్షం:
తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ ఆదేశాల మేరకు, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 106 కేసులకు సంబంధించి పోలీసులు స్వాధీనం చేసుకున్న 967.864 కిలోల గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ నిబంధనల ప్రకారం ధ్వంసం చేసింది. ధ్వంసం చేసిన గంజాయి విలువ సుమారు రూ.4,83,93,200 (రూ.4.83 కోట్లు) డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం నాడు హనుమకొండ మండలం అమ్మవారిపేట గ్రామ శివారులోని కాకతీయ మెడిక్లీన్ సర్వీసెస్‌కు చెందిన భస్మీకరణ ప్లాంట్‌లో గంజాయి ధ్వంస కార్యక్రమాన్ని నిర్వహించారు.మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ నిరంతరం చర్యలు చేపడుతోందని డీసీపీ అంకిత్ కుమార్ తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటూ, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి పోలీస్ శాఖ కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, సీసీఆర్బీ ఏసీపీ డేవిడ్ రాజు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కేసుల దర్యాప్తులో పటిష్ట ప్రణాళిక...కోర్టులతో సమన్వయం

బాధితులకు సత్వర న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన లక్ష్యం

జిల్లా ఎస్పీ కె. నరసింహ

సూర్యాపేట, మన ప్రజాపక్షం
:కేసుల దర్యాప్తులో ప్రణాళికాబద్ధంగా, శాస్త్రీయంగా, చట్ట నిబంధనలకు అనుగుణంగా పని చేయడంతో ఉత్తమ ఫలితాలు సాధించడం, తద్వారా బాధితులకు సత్వర న్యాయం అందించడంతో పాటు కేసులను నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందని, బాధితులకు సత్వర బరోసా, న్యాయం అందుతుంది, త్వరగా కేసులు పరిష్కారం అవుతాయని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ తెలిపారు.కేసులు నమోదు, దర్యాప్తు, సకాలంలో నేర అభియోగ పత్రాల దాఖలు, సకాలంలో దర్యాప్తు, వాగ్మూలం నమోదు, ఈ సాక్ష సద్వినియోగం, ఈ-సమన్స్ పంపించడం, ఆధారాల సేకరణ, జైలు శిక్షలు, కోర్టుల సమన్వయం, నాట్ గ్రిడ్ యాప్ వినియోగం, సైబర్ మోసాల్లో నగదు రికవరీ, రోడ్డు ప్రమాదాల్లో బాధితులకు సేవలు మొదలగు అంశాలపై జిల్లా పోలీస్ కార్యాలయం నందు పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పి నరసింహ సమీక్ష నిర్వహించారు. పోక్సో కేసుల దర్యాప్తులో అనుసరించాల్సిన ప్రణాళిక, లీగల్ సహాయం, కోర్టు వ్యవహారాలు, వాగ్మూలం సేకరణ, సాక్ష్యాధారాల నమోదు మొదలగు అంశాలపై పోక్సో కోర్టు పీపీ రఘురామయ్య అధికారులకు అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

పీఎం రాహత్ పథకం ద్వారా రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స

పథకం అమలుకు అన్ని ఆసుపత్రులు తప్పనిసరిగా నమోదు కావాలి

ఈ-డీపఆర్ పోర్టల్‌లో ప్రతి ప్రమాద కేసు నమోదు చేసి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలి

ప్రతి ఆరోగ్యశ్రీ ఆసుపత్రి, సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వివరాలను మ్యాపింగ్ చేయాలి

పిఎం రాహత్ పథకం సమర్థవంతమైన అమలుతో ఏటా రూ.100 కోట్ల వరకు ఆరోగ్యశ్రీ నిధుల ఆదా

ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రమాద కేసుల ఆన్‌లైన్ నమోదు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి

నారాయణపేట, మన ప్రజాపక్షం:
రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి మ్యాపింగ్ చేయాలి.రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో వైద్య చికిత్స అందించి ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.ప్రమాద బాధితులకు చికిత్స ఖర్చుతో సంబంధం లేకుండా సమీపంలోని ఆసుపత్రుల్లో తక్షణ వైద్య సేవలు అందించాలని సూచించారు.రోడ్డు ప్రమాద బాధితుల చికిత్స పథకం-2025 కింద పీఎం రాహత్ పథకం అమలు పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను హాజరయ్యారు.

పీఎం రాహత్ పథకం అమలు విధానం

ఆసుపత్రుల్లో బాధితులకు వైద్య సేవలు అందించే ప్రక్రియ, ప్రమాద వివరాల నమోదు, క్లెయిమ్‌ల ఆమోదం, నిధుల విడుదల తదితర అంశాలను అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడికి వైద్య చికిత్స అందించడం అత్యంత కీలకమని తెలిపారు. గోల్డెన్ అవర్‌లో తగిన చికిత్స అందించడం ద్వారా ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. ప్రమాద బాధితులను చికిత్స ఖర్చుల గురించి ఆలోచించకుండా సమీపంలోని ప్రభుత్వ లేదా పథకం పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అత్యవసర వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు.పీఎం రాహత్ పథకం కింద అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులకు ఒక్కొక్కరికి రూ.1.50 లక్షల వరకు చికిత్స ఖర్చును నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఈ పథకం కింద చికిత్స పొందుతున్న ప్రమాద బాధితుల సంఖ్య తక్కువగా ఉందని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పథకం ప్రయోజనాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాలని ఆదేశించారు.పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఏటా సుమారు రూ.100 కోట్ల వరకు ఆరోగ్యశ్రీ నిధులను ఆదా చేసే అవకాశం ఉందని తెలిపారు. ప్రమాద బాధితులకు మొదట పీఎం రాహత్ పథకం కింద నిర్దేశిత పరిమితి వరకు చికిత్స అందించాలని, ఆ పరిమితి దాటిన తర్వాత కూడా వైద్యపరంగా అవసరమైతే నిబంధనల ప్రకారం ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించి బాధితుల ప్రాణాలను కాపాడాలని సూచించారు.

పథకం అమలుకు అన్ని ఆసుపత్రులు నమోదు కావాలి

పీఎం రాహత్ పథకాన్ని అమలు చేసేందుకు జిల్లాల్లోని అన్ని ఆసుపత్రులు సంబంధిత పోర్టల్‌లో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులన్నీ పథకం అమలుకు అవసరమైన నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. నమోదైన ఆసుపత్రుల్లో ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అర్హులైన బాధితులకు పథకం ప్రయోజనాలు అందకుండా ఉండే పరిస్థితులు తలెత్తకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.ప్రభుత్వ, పథకం పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రులు రోడ్డు ప్రమాద కేసులను నేషనల్ హెల్త్ అథారిటీకి చెందిన టీఎంఎస్ 2.0 పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి ప్రమాదానికి సంబంధించిన వివరాలను ఈ-డీపఆర్ (వణూ=) పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు అవసరమైన ధ్రువీకరణలు, ఆమోదాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ-డీపఆర్‌లో ప్రతి ప్రమాద కేసు నమోదు చేసి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలి

ప్రమాదం జరిగిన 24 గంటల్లోపు నమోదైన కేసులకు సంబంధించి ఆసుపత్రుల నుంచి వచ్చే ధ్రువీకరణ అభ్యర్థనలను పోలీసు అధికారులు వెంటనే పరిశీలించి ఈ-డీపఆర్ పోర్టల్‌లో ఆమోదించాలని సీఎస్ స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రమాద కేసుల వివరాల నమోదు, ధ్రువీకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. ప్రమాద వివరాల నమోదు లేదా పోలీసు ధ్రువీకరణలో జాప్యం కారణంగా బాధితులకు చికిత్స అందడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని తెలిపారు.ఆసుపత్రులు సమర్పించిన చికిత్స క్లెయిమ్‌లను సంబంధిత పోర్టల్‌లో పరిశీలించి ఆమోదించిన అనంతరం, పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా ఆసుపత్రులకు నిధులు విడుదల చేసే



ప్రక్రియను సజావుగా నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు టీఎంఎస్ యూఎంపీ పేయర్ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించి, నిబంధనల ప్రకారం అవసరమైన ఆమోదాలు అందించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ బాధ్యతల మార్పిడి జరిగినప్పుడు పోర్టల్‌లో సంబంధిత అధికారి వివరాలు, జిల్లా అధికారిక ఈ-మెయిల్, మొబైల్ నంబర్లను వెంటనే నవీకరించాలని తెలిపారు. పథకం అమలులో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ నియమించిన ఫిర్యాదుల పరిష్కార అధికారి ద్వారా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

రోడ్డు ప్రమాద ప్రాంతాలను గుర్తించి మ్యాపింగ్ చేయాలి

ప్రతి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి మ్యాపింగ్ చేయాలని, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎస్ ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాల్లో ప్రమాదాల వివరాలు, బాధితులకు అందుతున్న వైద్య సేవలు, పెండింగ్ కేసులు, క్లెయిమ్‌ల ఆమోదం, ఆసుపత్రులకు నిధుల చెల్లింపులపై సమీక్షించాలని సూచించారు.జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారిని జిల్లా రోడ్డు భద్రతా కమిటీలో క్రియాశీల సభ్యుడిగా చేర్చి, ఈ-డీపఆర్, పీఎం రాహత్ పోర్టళ్ల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సహకారం పొందాలని తెలిపారు. ఆరోగ్య, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, బాధితులకు చికిత్స పూర్తికాకముందే పథకానికి సంబంధించిన ప్రక్రియల కారణంగా ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి చేసే పరిస్థితి రాకుండా చూడాలని స్పష్టం చేశారు.పథకంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు నెక్స్ట్‌జెన్ ఎం-పరివాహన్ మొబైల్ యాప్ వినియోగాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ఈ యాప్ ద్వారా రోడ్డు ప్రమాదాల సమాచారం అందించడం, క్లెయిమ్‌ల స్థితిని తెలుసుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రతి ప్రమాద కేసును పీఎం రాహత్ పథకం కింద నమోదు చేయాలి- అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అదనపు కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ, జిల్లాలో పీఎం రాహత్ పథకాన్ని తక్షణమే అమలులోకి తీసుకువచ్చి, ప్రమాద కేసులను ఈ పథకం కింద నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లాలో జరిగే ప్రతి రోడ్డు ప్రమాద కేసును నమోదు చేసి, అర్హులైన బాధితులకు పథకం ద్వారా వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.జిల్లాలోని ప్రతి ఆరోగ్యశ్రీ ఆసుపత్రి పీఎం రాహత్ పథకంలో వెంటనే నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల పూర్తి వివరాలను సేకరించి, సంబంధిత పోలీస్ స్టేషన్ పరిధిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) వివరాలతో మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఆసుపత్రులు, సంబంధిత పోలీసు అధికారుల మధ్య నిరంతర సంప్రదింపులు ఉండేలా చూడాలని, ప్రమాదం జరిగిన వెంటనే కేసు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసేలా పర్యవేక్షించాలని తెలిపారు.జిల్లా ఆరోగ్యశ్రీ మేనేజర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమన్వయంతో పనిచేస్తూ, అన్ని ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల నమోదు, పోలీస్ స్టేషన్ అధికారుల వివరాల మ్యాపింగ్, ప్రమాద కేసుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి రోడ్డు ప్రమాద కేసుకు సంబంధించి ఆసుపత్రి, పోలీసు శాఖలు వెంటనే స్పందించి అవసరమైన వివరాలను నమోదు చేయడంతో పాటు, ధ్రువీకరణలు, ఆమోదాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, బాధితులను సకాలంలో ఆసుపత్రులకు తరలించేలా పోలీసు, వైద్య, రవాణా, రహదారులు మరియు భవనాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పీఎం రాహత్ పథకం కింద నమోదైన కేసులు, బాధితులకు అందించిన చికిత్స, పెండింగ్ ఆమోదాలు, ఆసుపత్రులకు చెల్లించాల్సిన నిధులపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు.అర్హులైన ప్రతి ప్రమాద బాధితుడికి పథకం ప్రయోజనాలు అందేలా చూడాలని, ఆసుపత్రుల నమోదు లేదా పరిపాలనా ప్రక్రియల కారణంగా అత్యవసర వైద్య చికిత్సలో ఎలాంటి జాప్యం జరగకూడదని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్‌డబీ ఈఈ వెంకటరమణ, జిల్లా రవాణా అధికారి,ఆనంద్, ఈ డర్ మేనేజర్, శ్రీనివాస్ గౌడ్ మెంబెర్ పోషల్ రాజేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

వ్యక్తిగత సమాచారం భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

డిజిటల్ అరెస్ట్, నకిలీ ప్రొఫైల్స్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలి

మహబూబ్ నగర్, మన ప్రజాపక్షం:
సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలకు, ప్రభుత్వ ఉద్యోగులకు అవగాహన కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో మరియు మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ సమన్వయంతో, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులకు సైబర్ నేరాల నివారణ, సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకి పాల్గొని సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచార భద్రత, ఆన్‌లైన్ మోసాల నివారణకు సంబంధించిన పలు సూచనలు చేశారు.

వ్యక్తిగత సమాచారం భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డులు, సోషల్ మీడియా తదితర డిజిటల్ సేవల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత సమాచారం, ఆర్థిక వివరాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.మొబైల్ యాప్‌లను ఉపయోగించే ముందు వాటి నిబంధనలు, అనుమతులను పరిశీలించాలని, ఆధార్, పాన్ కార్డు వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే అనుమానాస్పద లింకులను తెరవడం, నమ్మకంలేని యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు.ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులు, ఉన్నతాధికారుల పేరుతో ఫోన్ చేసి బెదిరించడం, డిజిటల్ అరెస్ట్ పేరుతో భయాందోళనలకు గురిచేయడం, తక్షణమే డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేయడం వంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అనుమానాస్పద కాల్స్ వచ్చినప్పుడు తొందరపడి స్పందించకుండా, సంబంధిత అధికారులను సంప్రదించి వాస్తవాలను నిర్ధారించుకోవాలని సూచించారు.కార్యాలయాల్లోని అన్ని స్థాయుల సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి సైబర్ నేరాల నివారణకు సహకరించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, జిల్లా పోలీసు శాఖ సమన్వయంతో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు.

సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి: జిల్లా ఎస్పీ డి.జానకి

జిల్లా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ప్రజల



అమాయకత్వాన్ని, అత్యాశను, భయాన్ని ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా సైబర్ మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు అందుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా ఇలాంటి నేరాలను చాలా వరకు నివారించవచ్చని పేర్కొన్నారు.సైబర్ మోసం జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా ఫిర్యాదు చేయడం వల్ల మోసగాళ్ల ఖాతాల్లోకి బదిలీ అయిన డబ్బును నిలిపివేసే అవకాశం ఉంటుందని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం అందించాలని తెలిపారు.మొబైల్ ఫోన్లు, బ్యాంకింగ్ యాప్‌లు, సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లు ఏర్పాటు చేసుకోవాలని, వాటిని ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. అపరిచితులు పంపే ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేయవద్దని హెచ్చరించారు. కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారుల ఫొటోలతో నకిలీ వాట్సాప్ ప్రొఫైల్స్ సృష్టించి డబ్బులు అడిగే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, డబ్బులు పంపే ముందు సంబంధిత వ్యక్తులను నేరుగా సంప్రదించి నిర్ధారించుకోవాలని తెలిపారు.

పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సైబర్ నేరాలపై అవగాహన

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, అవగాహన వీడియోల ద్వారా సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతున్నాయి, సైబర్ నేరగాళ్లు ప్రజలను ఎలా మోసం చేస్తున్నారు అనే అంశాలను వివరించారు.ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు, డిజిటల్ అరెస్ట్‌లు, సోషల్ మీడియా మోసాలు, నకిలీ ప్రొఫైల్స్ తదితర సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయవద్దని, ఎవరికీ ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేయవద్దని వివరించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని, మోసానికి గురైన వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు.

పిల్లల ఆన్‌లైన్ భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

పిల్లలు ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ వంటి సోషల్ మీడియా యాప్‌లను ఉపయోగిస్తున్నప్పుడు తల్లిదండ్రులు తగిన పర్యవేక్షణ కలిగి ఉండాలని ఎస్పీ సూచించారు. సైబర్ వేధింపులు, ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాలు, అనుచిత కంటెంట్ వంటి అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించాలని కోరారు.చిన్నారులకు సంబంధించిన లైంగిక దోపిడీ చిత్రాలు, వీడియోలను వీక్షించడం, భద్రపరచడం లేదా ఇతరులకు పంపడం తీవ్రమైన చట్టపరమైన పరిణామాలకు దారితీస్తుందని హెచ్చరించారు. పిల్లల ఆన్‌లైన్ భద్రత విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.

స్థానికంగా సైబర్ నేరాలకు పాల్పడిన ముఠా అరెస్టు

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించిన ఎస్పీ, జిల్లాలోనూ సైబర్ నేరాలకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఇటీవల తువ్వగడ్డ తండా ప్రాంతంలో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఏడుగురు సభ్యుల ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి నిర్ణయం తీసుకునే ముందు వాస్తవాలను నిర్ధారించుకోవాలని ప్రజలకు సూచించారు.ఈ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన సైబర్ నేరాల నివారణ అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి.జానకి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరిప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి నిర్మల, సైబర్ క్రైమ్ డీఎస్పీ గిరి కుమార్, వివిధ శాఖల



అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు మైనర్ బాలిక మృతి కేసులో 24 గంటల్లో నిందితుడి అరెస్ట్

కేసు వివరాలు వెల్లడించిన సూర్యాపేట రూరల్ సీఐ జి. రాజశేఖర్

సూర్యాపేట, మన ప్రజాపక్షం:
ఆత్మకూరు (ఎస్) పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలిక మృతికి సంబంధించిన కేసులో నిందితుడిని పోలీసులు 24 గంటల్లో అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ప్రేమ పేరుతో మైనర్ బాలికను వేధింపులకు గురిచేసిన ఘటనలో వేధింపులు భరించలేక బాలిక ఈ నెల 22వ తేదీ రాత్రి మృతిచెందినట్లు కేసు నమోదైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో వాంకుడోతు నరేశ్, మాన్య తండా, ఏపూర్ తండా నివాసిని అక్టోబర్ 24వ తేదీన అరెస్ట్ చేసి, తదుపరి చట్టపరమైన చర్యల్లో భాగంగా రిమాండ్‌కు పంపించినట్లు సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.రాజశేఖర్ వెల్లడించారు. సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తు, నిందితుడి అరెస్ట్ ప్రక్రియలో ఆత్మకూరు (ఎస్) ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మైనర్ బాలికలపై వేధింపులకు పాల్పడటం తీవ్రమైన నేరమని, మహిళలు, బాలికల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పోలీసులు తెలిపారు.

మన ప్రజాపక్షం

హైదరాబాద్ తాగునీటి సంక్షోభంపై
కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హెచ్చరిక

కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి వెంటనే గోదావరి జలాలను ఎత్తిపోయాలి

నీటిని సముద్రంలోకి వదిలేస్తూ హైదరాబాద్ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తారా?

నీటి సమస్య పరిష్కరించకపోతే రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడిస్తాం



హైదరాబాద్, మన ప్రజాపక్షం

:హైదరాబాద్‌లో తాగునీటి సంక్షోభాన్ని నివారించేందుకు కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి వెంటనే గోదావరి జలాలను ఎత్తిపోయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే హైదరాబాద్ ప్రజలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి పంప్‌హౌస్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, కె.పి. వివేకానంద గౌడ్, మర్రి రాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే గంద్ర వెంకట రమణారెడ్డి సందర్శించారు. గోదావరి జలాలు పెద్ద మొత్తంలో దిగువకు ప్రవహిస్తూ సముద్రంలో కలుస్తున్నప్పటికీ, హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం వాటిని వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందని వారు ఆరోపించారు.జూన్ నుంచి ఇప్పటివరకు సుమారు 750 టీఎంసీలకు పైగా గోదావరి జలాలు సముద్రంలో కలిశాయని నేతలు పేర్కొన్నారు. కనీసం 250 టీఎంసీల నీటిని ఎత్తిపోసినా జలాశయాలు, చెరువుల్లో నీటి నిల్వలు పెరిగేవని, భూగర్భ జలమట్టాలు మెరుగుపడటంతో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు ఉపశమనం లభించేదని అభిప్రాయపడ్డారు.

ప్రజలకు నీటి కష్టాలు.. ప్రభుత్వానికి పట్టదా?

కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ నీటి సంక్షోభాన్ని పరిష్కరించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. హైదరాబాద్ ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా కనీసం ఇప్పటికైనా గోదావరి జలాలను ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. గతంలో కరోనా సమయంలోనూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు నీరు, విద్యుత్ సహా అవసరమైన సేవలు అందేలా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు.ఎమ్మెల్యే కె.పి. వివేకానంద గౌడ్ మాట్లాడుతూ జూలైలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ ప్రాంతాన్ని సందర్శించి గోదావరి జలాలు వృథాగా సముద్రంలోకి వెళ్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని గుర్తుచేశారు. ఎల్‌నినో ప్రభావం, భవిష్యత్తులో తలెత్తే నీటి సమస్యలపై అప్పుడే హెచ్చరించినట్లు తెలిపారు.నీటిని ఎత్తిపోసేందుకు సూచించిన ఇంజినీర్లకు బెల్టు ట్రీట్‌మెంట్ ఇస్తానని ముఖ్యమంత్రి బెదిరించారని వివేకానంద గౌడ్ ఆరోపించారు. ప్రజల నీటి సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ప్రజలే ముఖ్యమంత్రికి తగిన సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌కు ఏడాది పాటు తాగునీరు అందించేందుకు సుమారు 10 టీఎంసీల నీరు సరిపోతుందని పేర్కొంటూ, కన్నెపల్లి నుంచి వెంటనే నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు.ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లోని తన నియోజకవర్గంతో పాటు పలు ప్రాంతాల్లో ప్రజలు నీటి సరఫరా సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మూడు రోజులకు ఒకసారి నీరు వస్తున్నా, తక్కువ పీడనంతో సరఫరా అవుతోందని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్నాయని వాటర్ బోర్డు అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం ముందస్తుగా జలాశయాల్లో తగినంత నీటిని నిల్వ చేసుకుని ఉంటే హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లోనూ ప్రస్తుత పరిస్థితిని నివారించవచ్చని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కరువు పరిస్థితులకు కారణమవుతోందని ఆరోపించారు.

మేడిగడ్డపై చర్యలేవీ?

ఎమ్మెల్యే డి.సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లను లక్ష్యంగా చేసుకుని పేలుడు ఘటన జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మరమ్మతుల పనులు కూడా చేపట్టలేదని ఆరోపిస్తూ, కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారంతో తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేశారు.హైదరాబాద్‌లో వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిందని, అక్టోబర్ నెలలో రోజుకు సుమారు 7,000 ట్యాంకర్ బుకింగ్స్ జరుగుతున్నాయని సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. ఇది వేసవి కాలాన్ని తలపించే పరిస్థితి అని, నగరంలో నీటి కొరత తీవ్రతకు నిదర్శనమని అన్నారు.మాజీ ఎమ్మెల్యే గంద్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల ప్రశ్నలను పక్కదారి పట్టించే రాజకీయాలతో తప్పించుకోలేరని విమర్శించారు. విలువైన గోదావరి జలాలు సముద్రంలో కలుస్తుండగా, హైదరాబాద్ తాగునీటి సంక్షోభం దిశగా వెళ్లడం ఆందోళనకరమని అన్నారు. ప్రభుత్వం వెంటనే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయి ప్రజలకు తాగునీటి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

పొదలకూరులో ప్రశాంతంగా ముగిసిన నామినేషన్ల పరిశీలన

27న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం

అభ్యర్థుల వివరాలు నోటీసు బోర్డులో ప్రదర్శన

రిటర్నింగ్ అధికారి సీహెచ్ విజయకుమార్ రెడ్డి



పొదలకూరు,మన ప్రజాపక్షం: పొదలకూరు మండలంలో పరిషత్ ఎన్నికలకు సంబంధించి శనివారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నుంచి పరిశీలన వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికల అధికారులు, పోలీసు శాఖ సమన్వయంతో వ్యవహరించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి సీహెచ్ విజయకుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ నామినేషన్ల పరిశీలనలో ఆమోదం పొందిన అభ్యర్థుల వివరాలను మండల పరిషత్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

27న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం

పోటీ నుంచి తప్పుకోదలిచిన అభ్యర్థులకు ఈ నెల 27వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులు అదే రోజు మధ్యాహ్నం 3 గంటలలోపు ఫారం-బి సమర్పించాలని సూచించారు. నామినేషన్లను ఉపసంహరించుకోని వారిని స్వతంత్ర అభ్యర్థులగా గుర్తించి ఎన్నికల నిబంధనల ప్రకారం గుర్తులు కేటాయించే ప్రక్రియ చేపడతామని పేర్కొన్నారు.పరిషత్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను పురస్కరించుకుని పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు పర్యవేక్షణలో పొదలకూరు సీఐ గుత్తి వెంకట్రావు, ఎస్సై శివ రాకేష్ తమ సిబ్బందితో కలిసి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహిస్తూ నామినేషన్ల స్వీకరణ, పరిశీలన ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకున్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు రిటర్నింగ్ అధికారి కృతజ్ఞతలు తెలిపారు.

SPORTS

ఒక్క ఓవర్ చాలు.. మ్యాచ్ మనవైపు
తిప్పుకోవచ్చని నమ్మాం: నితీశ్ కుమార్ రెడ్డి



న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఒక్క భారీ ఓవర్ వస్తే చాలు, మ్యాచ్ ఫలితాన్ని మనవైపు తిప్పుకోవచ్చనే బలమైన నమ్మకంతోనే తాము ఆడామని భారత యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి వెల్లడించాడు. శనివారం హోగ్లీ ఓవల్ మైదానంలో జరిగిన ఉత్కంఠభరిత పోరులో, ఓటమి అంచున ఉన్న టీమిండియాను తిలక్ వర్మతో కలిసి నితీశ్ అద్భుత భాగస్వామ్యంతో విజయతీరాలకు చేర్చాడు. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.181 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, ఒకానొక దశలో 70 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆపై 15వ ఓవర్లో నమన్ ధీర్ కూడా పెవిలియన్ చేరడంతో టీమిండియా ఓటమి ఖాయమనిపించింది. ఆ క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన నితీశ్ (26లి), తిలక్ వర్మతో (51లి) కలిసి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. ఈ తెలుగు ఆటగాళ్ల ద్వయం ఏడో వికెట్‌కు కేవలం 30 బంతుల్లోనే 69 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్ తరఫున ఏడో వికెట్‌కు ఇదే అత్యధిక భాగస్వామ్యం కావడం విశేషం.మ్యాచ్ అనంతరం నితీశ్ మాట్లాడుతూ, "నేను క్రీజులోకి వచ్చినప్పుడు మా ఇద్దరి మధ్య ఒకటే చర్చ జరిగింది. ఒక్క భారీ ఓవర్ పడితే చాలు, ఒత్తిడి మొత్తం బౌలర్ల వైపు మళ్లుతుందని మేం బలంగా నమ్మాం. టీ20 ఫార్మాట్‌లో అదే కీలకం. వికెట్ల మధ్య చురుగ్గా పరుగెత్తాం, మంచి బంతులకు కూడా రెండు పరుగులు తీశాం. చెత్త బంతులను బౌండరీలకు తరలించాం. దీంతో బౌలర్లు ఒత్తిడికి గురవడం మేం గమనించాం. అక్కడే మ్యాచ్ మా చేతుల్లోకి వచ్చింది" అని వివరించాడు.చివరి ఐదు ఓవర్లలో 68 పరుగులు అవసరమైన దశలో, 18వ ఓవర్‌లో 17, 19వ ఓవర్‌లో 18 పరుగులు రాబట్టారు. చివరి ఓవర్‌లో 11 పరుగులు అవసరం కాగా, ప్రొఫెషనల్ ఆటతీరుతో నితీశ్ కుమార్ రెడ్డి, తిలక్ వర్మ విజయాన్ని ఖాయం చేశారు. "ఆ సమయంలో ప్రశాంతంగా ఉండటం ముఖ్యం. బౌలర్ ఎలా బౌలింగ్ చేస్తాడో అంచనా వేయాలి. క్రీజులో నిలబడితే సరైన సమయం అదే వస్తుంది. ప్రతిసారీ ఇది జరగకపోవచ్చు, కానీ నమ్మకంతో ఆడాలి" అని నితీశ్ తెలిపాడు.ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఎలాంటి సందేశం పంపారని అడగ్గా, "గంభీర్ సార్ ఎప్పుడూ ఒకటే చెబుతారు. ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా మనల్ని మనం నమ్ముకోవాలని అంటారు. మేం అదే చేశాం. మాపై ఎలాంటి అదనపు ఒత్తిడి పెట్టలేదు" అని నితీశ్ పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌తో కివీస్ బౌలర్లు మాట్ హెన్రీ, డఫ్ఫీ తమను తీవ్రంగా ఒత్తిడిలోకి నెట్టారని, కానీ చివరికి తాము విజయం సాధించడం ఆనందంగా ఉందని అన్నాడు. ఇరు జట్ల మధ్య మూడో టీ20 అక్టోబర్ 27న వెల్లింగ్‌టన్‌లో జరగనుంది.

"నువ్వుంటే చాలు గెలుస్తాం".. కోచ్‌ల నమ్మకాన్ని నిలబెట్టిన తిలక్ వర్మ



న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20లో భారత జట్టు అద్భుత విజయం సాధించింది. ఓటమి అంచున నిలిచిన జట్టును యువ సంచలనం తిలక్ వర్మ తన అద్భుత బ్యాటింగ్‌తో గెలిపించాడు. క్రైస్ట్‌చర్చ్‌లోని హేగ్లీ ఓవల్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో, 181 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ చివరి ఓవర్‌లో విజయాన్ని అందుకుంది. కేవలం 26 బంతుల్లో అజేయంగా 51 పరుగులు చేసిన తిలక్ వర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.మ్యాచ్ అనంతరం తిలక్ వర్మ మాట్లాడుతూ, తన అద్భుత ఇన్నింగ్స్ వెనుక ఉన్న స్ఫూర్తిని వెల్లడించాడు. "ఈ రోజు ఆటకు ముందు, నేను కోచ్ గౌతమ్ గంభీర్ సర్, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ సర్‌తో మాట్లాడాను. వారు నాతో ఒక్కటే చెప్పారు, 'మేమంతా నిన్ను నమ్ముతున్నాం, యావత్ భారత్ నిన్ను నమ్ముతోంది. నువ్వు ఆఖరి వరకు క్రీజులో ఉంటే, కచ్చితంగా మ్యాచ్ గెలిపిస్తావు' అని. వారి మాటలే నా మదిలో మెదిలాయి. అందుకే ఆటను వీలైనంత ముందుకు తీసుకెళ్లాలనుకున్నాను" అని తిలక్ వివరించాడు.ఒక దశలో 10.5 ఓవర్లకు 70 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి భారత్ తీవ్ర కష్టాల్లో పడింది. ఆ సమయంలో క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ, ముందుగా నమన్ ధీర్ (17 బంతుల్లో 31)తో కలిసి ఆరో వికెట్‌కు 42 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. నమన్ ఔటైన తర్వాత, మరో తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి (13 బంతుల్లో 26 నాటౌట్) క్రీజులోకి వచ్చాడు.ఇద్దరు తెలుగు ఆటగాళ్లు కలిసి కివీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ఓటమి ఖాయమనుకున్న దశ నుంచి అద్భుతమైన భాగస్వామ్యంతో జట్టును విజయతీరాలకు చేర్చారు. వీరిద్దరూ కలిసి అజేయంగా 69 పరుగులు జోడించి, మరో బంతి మిగిలి ఉండగానే భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యంలో నిలిచింది. మ్యాచ్ తర్వాత "నితీశ్ రెడ్డి, నేను.. కలిసి మ్యాచ్‌ను ముగించడం చాలా ఆనందంగా ఉంది" అని తిలక్ చెప్పడం విశేషం.